www.udyamakeratam.com
RNI: TGTEL/25/A0273

1వ వార్షికోత్సవం

# ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత:
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 61 | 11-8-2026 | మంగళవారం | పేజీలు: 8 | వెల : రూ.2/- |



# వానలు కురవాలని వరుణుడికి మహాయాగం

- నాగార్జునసాగర్ తీరాన మహా వరుణ యాగం
- సతీసమేతంగా పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి
- 11 హోమగుండాలు.. 108 మంది రుత్వికులతో వైదిక క్రతువు
- పూర్ణాహుతిలో పాల్గొన్న ముఖ్యమంత్రి దంపతులు
- జలాశయాలు నిండాలి.. పంటలు పండాలంటూ సంకల్పం

2

రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, జలాశయాలు నిండి రైతు సంక్షేమం వర్ధిల్లాలనే ఆకాంక్షతో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన 'మహా వరుణ యాగం' సోమవారం వైభవంగా ముగిసింది. నాగార్జున సాగర్ సమీపంలోని కృష్ణా తీరంలో ఉన్న విజయ విహార్ ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పవిత్ర వైదిక క్రతువు పూర్ణాహుతి కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి తన సతీమణితో కలిసి పాల్గొన్నారు.



ప్రతి పేద కుటుంబానికీ సొంతింటి కల నెరవేరుస్తాం

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చి వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం కట్టుబడి ఉందని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో సోమవారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన పాల్గొని సుమారు 394 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అంతకుముందు గూడూరు గ్రామంలోని గృహాలను పరిశీలించిన మంత్రులు, లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నాయకత్వంలో సంక్షేమ ఫలాలను పేదల ఇంటింటికీ అందిస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డులు, సన్న బియ్యం, పేద పిల్లల పెళ్లిళ్లకు ఆర్థిక సాయంతో పాటు విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలను కూడా పెంచామని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ దశల్లో నిలిచిపోయిన 35 వేల అసంపూర్తి ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తున్నామని వివరించారు. ఇందిరమ్మ గృహనిర్మాణ పథకంలో భాగంగా మొదటి విడతలో 4.5 లక్షలు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేస్తున్నామని, తర్వాతి విడతల్లోనూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు.

*- హనుమకొండ, ఆగస్టు 10*

2

# డిఫెన్స్ కారిడార్‌కు ఆమోదమివ్వండి

## కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు జితేందర్‌రెడ్డి విజ్ఞప్తి

- యూపీ, తమిళనాడు తరహాలో రక్షణ--ఏరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించాలని వినతి
- హైదరాబాద్‌లో 1,500కు పైగా రక్షణ, ఏరోస్పేస్ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు
- ప్రతిపాదనను పరిశీలిస్తామని రాజ్‌నాథ్‌సింగ్ హామీ

హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌ను కేంద్ర ప్రభుత్వ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ కారిడార్‌గా అధికారికంగా గుర్తించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, క్రీడా వ్యవహారాల సలహాదారు ఏ.పి. జితేందర్ రెడ్డి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కోరారు. న్యూఢిల్లీలోని రక్షణ మంత్రి అధికారిక నివాసంలో ఖమ్మం ఎంపీ ఆర్. రఘురామ్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్‌లతో కలిసి ఆయన సోమవారం భేటీ అయ్యారు. ఉత్తరప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో ఉన్న రక్షణ కారిడార్ల తరహాలోనే తెలంగాణకు కూడా డిఫెన్స్ కారిడార్ కేటాయించాలని గతంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేసిన విజ్ఞప్తిని ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి తీసుకెళ్లారు.

- న్యూఢిల్లీ, ఆగస్టు 10

.. వివరాలు 2లో



# క్లీన్ ఎనర్జీ గ్లోబల్ హబ్‌గా తెలంగాణ



- కాలిఫోర్నియా అనుభవాలతో రాష్ట్రంలో ఇంధన విప్లవం
- అమెరికా పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2



# తెలంగాణలో ముగిసిన 'సర్' ప్రక్రియ

73.95 లక్షల ఓట్లు తొలగించినట్లు సమాచారం

2

# ట్రైబ్యునళ్ల సంస్కరణలకు లోక్‌సభ పచ్చజెండా

- విపక్షాల ఆందోళనల మధ్య బిల్లుకు ఆమోదం

4



# పోలవరం తొలిదశకు కేంద్రం ఆమోదం

సవరించిన అంచనా వ్యయం రూ.30,436.95 కోట్లు

4




# అమిత్ షా వివరణ ఇవ్వాల్సిందే

- అప్పటి వరకు పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన తప్పదు
- హెచ్చరించిన ప్రియాంక, రాహుల్ గాంధీ

4

# తెలంగాణ కోసమే బతికిన పెద్ది

- ప్రజల అభిమానం చూరగొన్న నేత
- నర్సంపేట కాలేజీకి పెద్ది పేరు పెడతాం
- సంతాపసభలో కేటీఆర్ వెల్లడి

3





# తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయండి

సాగునీటి సమస్యను తీర్చండి

మంత్రి ఉత్తమ్‌కు హరీష్ రావు లేఖ

3



# ఇంటింటా త్రివర్ణం రెపరెపలాడాలి

- 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనండి
- దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- వికసిత భారత్ సంకల్పాన్ని చాటుదామన్న ప్రధాని
- క్విట్ ఇండియా ఉద్యమ వీరుల త్యాగాలకు నివాళి

4

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక





# ముగిసిన 'సర్' ప్రక్రియ

**73.95 లక్షల ఓట్లు తొలగించినట్లు సమాచారం**

**2.64 కోట్ల ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి**

**రాష్ట్రవ్యాప్తంగా 78.14 శాతం నమోదు**

**హైదరాబాద్, ఆగస్టు 10:** తెలంగాణలో చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ 'సర్' ఎన్యూమరేషన్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 3,38,26,448 మంది ఓటర్లు ఉండగా, ఇప్పటివరకు 2,64,30,494 ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తయింది. ఈ ప్రక్రియలో 73,95,954 మంది ఓటర్ల పేర్లు తొలగించినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ 78.14 శాతంగా నమోదైంది. జిల్లాల వారీగా పరిశీలిస్తే యాదాద్రి భువనగిరి జిల్లా 94.30 శాతం డిజిటలైజేషన్‌తో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది. మెదక్ జిల్లాలో 90.54 శాతం, సూర్యాపేటలో 90.43 శాతం ప్రక్రియ పూర్తయింది. జగిత్యాలలో 89.60 శాతం, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో 89.45 శాతం డిజిటలైజేషన్ నమోదైంది. మరోవైపు హైదరాబాద్ జిల్లా డిజిటలైజేషన్‌లో రాష్ట్రంలో చివరి స్థానంలో నిలిచింది. హైదరాబాద్‌లో 27,74,687 ఎన్యూమరేషన్ ఫారాలతో 58.58 శాతం మాత్రమే డిజిటలైజేషన్ పూర్తయింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 63.82 శాతం, రంగారెడ్డి జిల్లాలో 64.91 శాతం నమోదైంది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలకు రెండుసార్లు గడువు పొడిగించినప్పటికీ ఆశించిన స్థాయిలో డిజిటలైజేషన్ పెరగకపోవడం గమనార్హం. 'సర్' ప్రక్రియ పూర్తయిన విషయాన్ని ఈ నెల 12న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అధికారికంగా ప్రకటించే అవకాశం ఉన్నట్లు సమాచారం. అనంతరం ఈ నెల 17న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. ముసాయిదా జాబితాపై నెల రోజులపాటు అభ్యంతరాలు, దరఖాస్తులను స్వీకరించనున్నారు. వాటి పరిశీలన, పరిష్కారం అనంతరం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను విడుదల చేయనున్నట్లు సమాచారం.

# క్లీన్ ఎనర్జీ గ్లోబల్ హబ్‌గా తెలంగాణ

**పునరుత్పాదక ఇంధన రంగంలో భారీ పెట్టుబడులే లక్ష్యం**

**2030 నాటికి దేశంలో 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ సామర్థ్యం**

**గ్రిడ్ ఆధునీకరణ.. బ్యాటరీ నిల్వ వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి**

**కాలిఫోర్నియా అనుభవాలతో రాష్ట్రంలో ఇంధన విప్లవం**

**అమెరికా పర్యటనలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**హైదరాబాద్, ఆగస్ట్ 10:** డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అమెరికా పర్యటనలో భాగంగా ప్రపంచ ప్రసిద్ధ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్కిలోని గోల్డ్‌మన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ పరిధిలోని 'ఇండియా ఎనర్జీ ,క్లైమేట్ సెంటర్' ను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో భారతదేశ పునరుత్పాదక ఇంధన లక్ష్యాల సాధనతో పాటు తెలంగాణను స్వచ్ఛ ఇంధన రంగాన గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన భవిష్యత్ ప్రణాళికలపై లోతుగా చర్చించారు. భారతదేశం నిర్దేశించుకున్న 2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ సామర్థ్యాన్ని అందుకునేందుకు అవసరమైన వ్యూహాలు, తగ్గుతున్న శుద్ధ సాంకేతికత ఖర్చులు తెచ్చిపెడుతున్న నూతన అవకాశాలను ఈ సమావేశంలో పరిశీలించారు. గ్రిడ్ ఆధునీకరణ, పారిశ్రామిక డీకార్బనైజేషన్, ఆధునిక బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థల సమన్వయం , సమాన అవకాశాలతో కూడిన శక్తి పరివర్తన మార్గాలపై పరిశోధకులు, అధికారులతో డిప్యూటీ సీఎం విస్తృతంగా ఆలోచనలు పంచుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం చేపట్టిన వినూత్న పునరుత్పాదక ఇంధన మోడల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పారదర్శకమైన హరిత విధానం ద్వారా గ్రీన్ ఎనర్జీ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ రాష్ట్రంలో సౌరశక్తి సహా ఇతర పునరుత్పాదక సామర్థ్యాన్ని వేగవంతంగా విస్తరిస్తున్న తీరును డిప్యూటీ సీఎం వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో సోలార్ ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టడం, పీఎం-కుసుమ్ పథకం ద్వారా అన్నదాతలకు స్వచ్ఛ ఇంధనాన్ని అందించడం వంటి ప్రజాకేంద్రిత నమూనాలు అంతర్జాతీయ ప్రతినిధుల ప్రశంసలు అందుకున్నాయి. 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు క్లీన్-టెక్ పరికరాల తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్న తీరును ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు.సిలికాన్ వ్యాలీ ఆవిష్కరణలు, కాలిఫోర్నియా రాష్ట్ర ఇంధన రంగానుభవాలను ఉపయోగించుకుని తెలంగాణలో సరికొత్త ఇంధన విప్లవానికి శ్రీకారం చుట్టాలని ఈ భేటీలో నిర్ణయించారు. విద్యుత్, రవాణా, పారిశ్రామిక , వాతావరణ స్థిరత్వ రంగాలలో సంయుక్త అధ్యయనాలు చేపట్టడం, విధాన నిర్ణేతలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా రాష్ట్రంలో ఇంధన భద్రతను, ఆర్థిక పోటీతత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు యూసీ బర్కీ ప్రతినిధులతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.



# వానలు కురవాలని.. వరుణుడికి మహాయాగం

- నాగార్జునసాగర్ తీరాన యాగం
- సతీసమేతంగా పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి
- 11 హోమగుండాలు.. 108 మంది రుత్విక్కులతో వైదిక క్రతువు
- పూర్ణాహుతిలో పాల్గొన్న సీఎం దంపతులు
- జలాశయాలు నిండాలి.. పంటలు పండాలంటూ సంకల్పం



**నాగార్జునసాగర్, ఆగస్టు 10:** రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురవాలి.. కృష్ణా, గోదావరి నదులు పరవళ్లు తొక్కాలి.. చెరువులు, కుంటలు జలకళను సంతరించుకోవాలి.. పంట పొలాలు పచ్చదనంతో కళకళలాడాలి.. అన్నదాతల జీవితాల్లో ఆనందం వెల్లివిరియాలన్న సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం సోమవారం మహా వరుణ యాగాన్ని నిర్వహించింది. నాగార్జునసాగర్ సమీపంలోని కృష్ణా నదీ తీరాన విజయ విహార్ వేదికగా వేద మంత్రోచ్ఛారణల మధ్య ఈ క్రతువు శాస్త్రోక్తంగా సాగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతీసమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. యాగం ముగింపు సందర్భంగా నిర్వహించిన పూర్ణాహుతిలో పాల్గొన్నారు. ఈ ఏడాది రుతుపవనాల పరిస్థితులు, వర్షపాతం తగ్గడం, జలాశయాల్లో నీటిమట్టాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం నేపథ్యంలో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురవాలన్న ఆకాంక్షతో ప్రభుత్వం వరుణ యాగానికి శ్రీకారం చుట్టింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు కూడా యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

## 11 హోమగుండాలు.. 108 మంది రుత్విక్కులు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందిన వేద పండితులు, రుత్విక్కుల ఆధ్వర్యంలో యాగాన్ని నిర్వహించారు. ఇందుకోసం విజయ విహార్ ప్రాంగణంలో ప్రత్యేకంగా 11 హోమగుండాలను ఏర్పాటు చేశారు. 108 మంది రుత్విక్కులు, వేద పండితులు మంత్రోచ్ఛారణల మధ్య హోమాలు నిర్వహించారు. దేవాదాయ శాఖ పర్యవేక్షణలో ఉదయం నుంచి యాగ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి.

## సాగర్‌లో తగ్గిన జలమట్టం

నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.045 టీఎంసీలు కాగా, ప్రస్తుతం సుమారు 145.65 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం సుమారు 518 అడుగుల వద్ద నీటిమట్టం కొనసాగుతున్నట్లు తెలిపారు. గత ఏడాది ఇదే సమయంలో జలాశయంలో నీటి నిల్వలు మెరుగ్గా ఉన్నాయని పేర్కొన్నారు.

## పల్లెలు పచ్చగా కళకళలాడాలని..

వర్షాలు కురిసి కృష్ణా, గోదావరి నదులు జీవజలాలతో ప్రవహించాలని, ప్రాజెక్టులు, చెరువులు నిండాలని, సాగునీటికి కొరత లేకుండా రైతులు సుభిక్షంగా ఉండాలన్న సంకల్పంతో మహా వరుణ యాగం నిర్వహించినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్, వెంకట్‌రెడ్డి, కొండా సురేఖతోపాటు ప్రభుత్వ సలహాదారులు, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

- పేద కుటుంబానికీ సొంతింటి కల నెరవేరుస్తాం
- దశలవారీగా లబ్ధిదారులకు ఇండ్లు కేటాయిస్తాం
- ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయం
- తొలి విడతలో 4.5 లక్షలు.. రెండో విడతలో మరో 2.5 లక్షల ఇళ్లు
- కులం, మతం, రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారుల ఎంపిక
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి
- కమలాపూర్‌లో సుమారు 394 ఇళ్ల అందజేత



**హనుమకొండ, ఆగస్టు 10:** రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. పేదలు ఆత్మగౌరవంతో జీవించేలా దశలవారీగా అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమ పథకాలను పేదల గడప వద్దకు తీసుకెళ్తున్నామని తెలిపారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ పాల్గొని సుమారు 394 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. పేదవాడికి సొంతిల్లు అనేది కేవలం నివాసం మాత్రమే కాదని, వారి ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. అందుకే ఇల్లు లేని అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇంటిని అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద తొలి విడతలో 4.5 లక్షల ఇళ్లను, రెండో విడతలో మరో 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. మూడో, నాలుగో విడతల్లోనూ ఇళ్ల మంజూరు కొనసాగుతుందని చెప్పారు. అర్హత ఉన్న ఏ ఒక్క పేద కుటుంబాన్నీ విస్మరించబోమని భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా గతంలో నిర్మాణాలు ప్రారంభించి అసంపూర్తిగా మిగిలిపోయిన సుమారు 35 వేల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందిస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తోందన్నారు. నిర్మాణ పురోగతిని బట్టి విడతలవారీగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నట్లు వివరించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో కులం, మతం, రాజకీయ పార్టీ అనే తేడా ఉండదని పొంగులేటి స్పష్టం చేశారు. అర్హత ఒక్కటే ప్రామాణికమని, రాజకీయ వివక్షకు ఎలాంటి అవకాశం లేదన్నారు. ఇళ్లు నిర్మించి ఇవ్వడంతోనే ప్రభుత్వ బాధ్యత ముగిసిపోదని, లబ్ధిదారుల కాలనీల్లో తాగునీరు, రహదారులు, విద్యుత్ వంటి కనీస మౌలిక సదుపాయాలను కూడా కల్పిస్తామని చెప్పారు. రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీతో పాటు పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆహార, సౌందర్య సాధనాల చార్జీలను కూడా ప్రభుత్వం పెంచిందన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. "ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే ఇందిరమ్మ ఇళ్లు. పేదల ముఖాల్లో ఆనందం చూడటమే మా లక్ష్యం. అర్హులైన ప్రతి కుటుంబానికి దశలవారీగా సొంతింటిని అందిస్తాం" అని పొంగులేటి స్పష్టం చేశారు. అంతకుముందు గూడూరు గ్రామంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను మంత్రులు పరిశీలించారు. లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఝాన్సీతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.


# హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ కారిడార్‌కు ఆమోదమివ్వండి

- కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు జితేందర్‌రెడ్డి విజ్ఞప్తి
- యూపీ, తమిళనాడు తరహాలో రక్షణ-ఏరోస్పేస్ కారిడార్‌గా ప్రకటించాలని వినతి
- హైదరాబాద్‌లో 1,500కు పైగా రక్షణ, ఏరోస్పేస్ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు
- ప్రతిపాదనను పరిశీలిస్తామని రాజ్‌నాథ్ హామీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌ను కేంద్ర ప్రభుత్వ రక్షణ, ఏరోస్పేస్ కారిడార్‌గా అధికారికంగా ప్రకటించాలని తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి, క్రీడా వ్యవహారాల సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉత్తరప్రదేశ్, తమిళనాడులో ఇప్పటికే ఏర్పాటు చేసిన డిఫెన్స్ కారిడార్ల తరహాలో హైదరాబాద్-బెంగళూరు కారిడార్‌కు కూడా గుర్తింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలోని అధికారిక నివాసంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను సోమవారం జితేందర్‌రెడ్డి కలిశారు. ఆయన వెంట ఖమ్మం ఎంపీ ఆర్.రఘురాంరెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో కేంద్రానికి చేసిన విజ్ఞప్తిని జితేందర్‌రెడ్డి మరోసారి రాజ్‌నాథ్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లారు.

## రక్షణ రంగానికి హైదరాబాద్ కీలకం


దేశంలోనే అతిపెద్ద రక్షణ, ఏరోస్పేస్ కేంద్రాల్లో హైదరాబాద్ ఒకటని జితేందర్‌రెడ్డి వివరించారు. నగరంలో డజనుకు పైగా ప్రధాన రక్షణ రంగ ప్రభుత్వ సంస్థలు, వ్యూహాత్మక రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ ప్రయోగశాలలు ఉన్నాయని తెలిపారు. వీటితోపాటు 1,500కు పైగా ఏరోస్పేస్, రక్షణ రంగ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు కార్యకలాపాలు సాగిస్తున్నాయని వివరించారు. తెలంగాణలో రక్షణ, ఏరోస్పేస్ రంగ ఎగుమతులు 2025-26లో వందశాతం వృద్ధిని నమోదు చేశాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్-బెంగళూరు డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్‌కు కేంద్రం అధికారిక గుర్తింపు కల్పిస్తే ఈ రంగం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని వివరించారు. ప్రతిపాదిత కారిడార్‌తో దేశీయ రక్షణ ఉత్పత్తుల తయారీ సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని జితేందర్‌రెడ్డి తెలిపారు. పరిశోధన, అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం కావడంతో పాటు అత్యాధునిక మౌలిక వసతుల కల్పన, పరిశ్రమల సామర్థ్య విస్తరణకు అవకాశం ఏర్పడుతుందన్నారు. కొత్త పెట్టుబడులు రావడంతో పాటు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కూడా అందుబాటులోకి వస్తాయని వివరించారు. దేశ రక్షణ సన్నద్ధతను మరింత బలోపేతం చేయడంతో పాటు స్వదేశీ రక్షణ ఉత్పత్తుల తయారీకి ఈ కారిడార్ కీలకంగా మారుతుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యాల సాధనకు కూడా హైదరాబాద్-బెంగళూరు కారిడార్ గణనీయంగా దోహదపడుతుందని వివరించారు. తెలంగాణకు ఇప్పటికే ఉన్న రక్షణ, ఏరోస్పేస్ పరిశ్రమల అనుకూల వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకోవాలని జితేందర్‌రెడ్డి కోరారు. దీనిపై స్పందించిన కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రతిపాదనను సానుకూలంగా పరిశీలిస్తామని హామీ ఇచ్చినట్లు జితేందర్‌రెడ్డి తెలిపారు.



# స్మార్ట్ రేషన్ కార్డులు విప్లవాత్మక నిర్ణయం

**సిఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన జగ్గారెడ్డి**

**సంగారెడ్డి, ఆగస్ట్ 10:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తోందని, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ గొప్ప ముందడుగని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. గత పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేక పోయారని, ఇప్పుడు కొత్త కార్డులు ఇవ్ంవడంతో పాటు, స్మార్ట్ కార్డులు కూడా ఇవ్వబోతున్నామని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ అనేక కార్యక్రమాలు చేపట్టిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈనెల 15న జిల్లాలో పర్యటించనున్నారు. సంగారెడ్డిలో నూతన స్మార్ట్ రేషన్ కార్డులను సీఎం పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా సోమవారం తారా డిగ్రీ కాలేజీలో హెలిప్యాడ్, అంబేద్కర్ స్టేడియంలో సభా స్థలిని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, ఎస్పీ పరితోష్ పంకజ్ పరిశీలించారు. అనంతరం జగ్గారెడ్డి మాట్లాడుతూ... పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అరకొరగా రేషన్ కార్డులు ఇచ్చారని విమర్శించారు. కోటి 5 లక్షల మందికి కాంగ్రెస్ ప్రభుత్వంలో స్మార్ట్ రేషన్ కార్డులు ఇవ్వబోతున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కమిట్‌మెంట్‌తో పని చేస్తోందని జగ్గారెడ్డి తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షించదగిన విషయమన్నారు. ఇది ప్రభుత్వ కార్యక్రమమైనా కాంగ్రెస్ పార్టీ తరఫున సీఎం రేవంత్‌కు ఘనంగా స్వాగతం పలుకుతామని చెప్పారు. సభని 50 వేల మందితో నిర్వహించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని జగ్గారెడ్డి పేర్కొన్నారు.





# తెలంగాణ కోసమే బతికిన పెద్ది

- ప్రజల అభిమానం చూరగొన్న నేత
- నర్సంపేట కాలేజీకి పెద్ది పేరు పెడతాం
- సంతాపసభలో కేటీఆర్ వెల్లడి

**నర్సంపేట, ఆగస్ట్ 10:** ఎంతకాలం బతికినం అనేది కాదు.. ఎట్లా బతికినం అనేది ముఖ్యం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి జీవితమే అందుకు ఉదాహరణ అన్నారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి సంస్మరణ సభకు హరీశ్ రావుతో కలిసి హాజరయ్యారు. పెద్ది చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పెద్ది సుదర్శన్ రెడ్డి అంతిమయాత్రకు వేలాది మంది తరలివచ్చారు. లక్షకు పైగా మంది 12 గంటల పాటు వర్షం పడుతున్నా ఎక్కడికి వెళ్లకుండా అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఆయన ఎలాంటి వ్యక్తే తెలుపడానికి ఇదే నిదర్శమన్నారు. పెద్ది కోరుకున్నట్లు వచ్చే రెండేండ్లలో అధికారంలోకి వస్తామన్నారు. మేము అధికారంలోకి వచ్చిన తర్వాత నర్సంపేటలోని మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్ రెడ్డి పేరు పెడతామన్నారు. భవిష్యత్ తరాలు గుర్తు చేసుకునే విధంగా ఘన నివాళులు అర్పిద్దామన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తెలంగాణ ఉద్యమాన్ని ఒంటిచేత్తో నడిపిన నాయకుడు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అని బీఆర్ఎస్ కేటీఆర్ అన్నారు. ప్రజల్లో సుదర్శన్‌రెడ్డి పట్ల ఉన్న గౌరవం.. ఆయన అంతిమయాత్రలో



పాల్గొన్నవారి సంఖ్యను చూస్తే తెలుస్తోందని చెప్పారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో నిర్వహించిన పెద్ది సుదర్శన్ సంస్మరణ సభలో కేటీఆర్ మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా పెద్ది సుదర్శన్‌రెడ్డి భారీ ఎత్తున నిర్వహించేవారు. ఆయన్ను బతికించుకునేందుకు ఎంత ప్రయత్నం చేయాలో అంతా చేశాం. ఎవరైనా ఎంతకాలం బతికామన్నది ముఖ్యం కాదు.. ఎలా బతికామన్నదే ముఖ్యం. ఎమ్మెల్యేగా ఒక్కసారి గెలిచినా.. జనం గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయేలా ఆయన పనిచేశారు. నర్సంపేటలో నిర్మించే మెడికల్ కాలేజీకి పెద్ది సుదర్శన్‌రెడ్డి పేరు పెడతాం. ఆయన కుటుంబాన్ని కాపాడుకునే బాధ్యతను బీఆర్ఎస్ పార్టీ తీసుకుంటుందని కేటీఆర్ అన్నారు.తెలంగాణ ఉద్యమంలో పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగా సాగిన పోరాటం, తెలంగాణ అనంతరం నర్సంపేట ఎమ్మెల్యే గా పెద్ది చేసిన శాశ్వత పనులపై చేసిన డాక్యుమెంట్ ప్రదర్శన పలువురిని కంటతడి పెట్టించింది. డాక్యుమెంటరీ చూసి పెద్ది భార్య స్వప్న కన్నీరుమున్నీరైంది. కార్యక్రమంలో శాసన మండలి విపక్షనేత సిరికొండ, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, మాజీ మంత్రి ఎర్రబెల్లి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, అరూరి రమేష్, గండ్ర సహా పలువురు నేతలు హాజరయ్యారు.

### పెద్ది విగ్రహావిష్కరణను అడ్డుకున్న పోలీసులు

తెలంగాణ ఉద్యమకారుడు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత నేత పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రాహావిష్కరణలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వరంగల్ జిల్లా నర్సంపేటలో విగ్రహాన్ని ఏర్పాటుగా చేయగా అక్కడకు చేరుకున్న పోలీసులు విగ్రహ ఏర్పాటును అడ్డుకున్నారు. ప్రైవేట్ భూమిలో విగ్రహం ఏర్పాటు చేసుకుంటే మీకేంటని బీఆర్ఎస్ నాయకులు ప్రతిఘటించారు.

# అన్ని కులాలకు సమాన అవకాశాలే లక్ష్యం

- బీసీల హక్కుల పోరాటం ఎవరికీ వ్యతిరేకం కాదు
- రాజకీయాలకు అతీతంగా సామాజిక న్యాయం కోసం పనిచేయాలి
- స్వశక్తితో రాజుగా ఎదిగిన వీరుడు సర్వాయి పాపన్న
- సచివాలయం ఎదుట మహనీయుల విగ్రహాల ఏర్పాటు
- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ వెల్లడి

**హైదరాబాద్, ఆగస్ట్ 10:** తెలంగాణలో బీసీలతో పాటు అన్ని కులాలకు సమాన అవకాశాలు కల్పించేందుకు రాజకీయాలకు అతీతంగా పనిచేయాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ అన్నారు. సర్వాయి పాపన్న వంటి వీరుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న గొప్పతనాన్ని వివరిస్తూ మహేష్ కుమార్ మాట్లాడుతూ.. ఎంతో మంది రాజులు, చక్రవర్తులు చరిత్రలో ఉన్నప్పటికీ, చిన్న జాతిలో పుట్టి పోరాటంతో రాజుగా ఎదిగిన వ్యక్తి సర్వాయి పాపన్న అని అన్నారు. పుట్టుకతోనే చక్రవర్తులుగా మారిన వారితో పోలిస్తే, పాపన్న పోరాడి రాజయ్యారని పేర్కొన్నారు. మేము రాజులమే.. మేము కూడా పాలించగలుగుతాం అనే ఆత్మవిశ్వాసాన్ని పేద, వెనుకబడిన వర్గాల్లో కల్పించిన గొప్ప వ్యక్తి సర్వాయి పాపన్న అని మహేష్ కుమార్ అన్నారు. పేద వర్గాల కోసం పాపన్న పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కుల పెద్దలతో చర్చించి సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మహేష్ కుమార్



తెలిపారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కూడా మాట్లాడినట్లు చెప్పారు. సెక్రటేరియట్ ముందు సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే విగ్రహాన్ని ఆవిష్కరిస్తామని వెల్లడించారు. విగ్రహాలు కేవలం పూలమాలలు వేసేందుకు మాత్రమే కాదని, ఆయా మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగేందుకే విగ్రహాలను ఏర్పాటు చేయాలని మహేష్ కుమార్ అన్నారు. సామాజిక సంస్కర్తలు జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను కూడా ఆవిష్కరించనున్నట్లు మహేష్ కుమార్ తెలిపారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలు, మహిళలు, పేదల కోసం పోరాడిన మహనీయుల స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా రాహుల్ గాంధీ పాదయాత్ర చేశారని మహేష్ కుమార్ పేర్కొన్నారు. ఎవరు ఎంతో.. వారికి అంత అనేది రాహుల్ గాంధీ నినాదమని తెలిపారు. అదే నినాదంతో తెలంగాణలో కులగణన చేపట్టామని అన్నారు. రాష్ట్రంలో కులగణనకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయని చెప్పారు. అయితే అసెంబ్లీలో కులగణనకు మద్దతు ఇచ్చిన బీజేపీ.. కేంద్ర స్థాయిలో మాత్రం దానిని అడ్డుకుంటోందని విమర్శించారు. బీసీలు తమ హక్కుల కోసం పోరాడితే కొందరు దానిని ఇతరులకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటంగా చిత్రీకరిస్తున్నారని మహేష్ కుమార్ అన్నారు. మా హక్కుల కోసం మేము పోరాడితే.. మాకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని అంటున్నారు. మేము ఎవరికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. అన్ని కులాలను కలుపుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. తమ కులం నుంచి వ్యతిరేకత వచ్చే అవకాశం ఉందని తెలిసినా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలకు మద్దతు ఇచ్చారని, కులగణన చేపట్టారని పేర్కొన్నారు. ఎవరినీ ఇబ్బందులకు గురి చేయకుండా అన్ని కులాలను కలుపుకుని సమాన అవకాశాలతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. మంత్రిగా ఉన్న సమయంలో శ్రీనివాస్ గౌడ్ పార్టీలకు అతీతంగా బీసీల కోసం, కులాల సంక్షేమం కోసం పనిచేశారని మహేష్ కుమార్ పేర్కొన్నారు. తాను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బీసీలతో పాటు ఇతర కులాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని రాహుల్ గాంధీ సూచించారని తెలిపారు. ఈ క్రమంలో పార్టీ పదవుల్లో కూడా సామాజిక సమతుల్యతకు ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. 79 శాతం ఉపాధ్యక్ష పదవులను బీసీలకు ఇచ్చామని, అదే సమయంలో అన్ని కులాలకు సమానంగా అవకాశాలు కల్పించామని మహేష్ కుమార్ వెల్లడించారు. కులాల హక్కులు, సామాజిక న్యాయం వంటి అంశాల్లో రాజకీయ పార్టీలకు అతీతంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, గౌరవం లభించేలా ముందుకు సాగడమే లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు.



# తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేయండి

### రైతులకు సాగునీటి సమస్యను తీర్చండి

### మంత్రి ఉత్తమ్‌కు హరీష్ రావు లేఖ

**హైదరాబాద్, ఆగస్ట్ 10:** తక్షణమే కాళేశ్వరం మోటర్లు ఆన్ చేసి రైతుల ఇబ్బందులు తొలగించాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి హరీశ్ రావు లేఖ రాశారు. రిజర్వాయర్లలో నీటిని సకాలంలో నింపకపోవడం వల్ల పంటలు సాగు కాక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో వివిధ జిల్లాల్లో ఉన్న అన్నపూర్ణ, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్, బస్వాపూర్ రిజర్వాయర్లను నింపి, సుమారు 4 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు అందాలని, దానికోసం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మిడ్ మానేరు నుంచి మోటర్లను ఆన్ చేసి నీటి పంపింగ్ చేయాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఎల్‌నినో వల్ల తక్కువ వర్షపాతం, మరోవైపు ప్రాజెక్టుల్లో నీళ్లు లేక రైతులు ఆందోళనలో ఉన్నారు. వానాకాలం పంట సాగుకు సాగునీటి కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. అదేవిధంగా లోయర్ మానేరు డ్యామ్ పూర్తి నీటి సామర్థ్యం 24 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 6.9 టీఎంసీల నీటి లభ్యత మాత్రమే ఉందన్నారు. మిడ్ మానేరు నుంచి లోయర్ మానేరుకు నీటిని నింపి ఎస్సారెస్పీ స్టేజ్-2లోని ఆయకట్టుకు నీరు అందించి రైతులను ఆదుకోవాలని లేఖలో కోరారు. గత యాసంగి పంటలో కాళేశ్వరం ప్రాజెక్టులోని రిజర్వాయర్ల ఆయకట్టు పరిధిలో 4 లక్షల ఎకరాలు సాగైన విషయం గుర్తించి, ఈ వానాకాలం పంటకు, అదేవిధంగా వచ్చే యాసంగి పంటకు కూడా సాగునీరు అందేలా కాళేశ్వరం ప్రాజెక్టు అంతర్భాగంలోని అన్ని రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు.

# హాస్టల్‌లో విద్యార్థిపై తోటి విద్యార్థుల దాడి

### కామారెడ్డికి చెందిన విద్యార్థి పరిస్థితి విషమం

**మేడ్చల్, ఆగస్ట్ 10:** మేడ్చల్‌లోని శ్రీ చైతన్య పాఠశాలకు సంబంధించిన హాస్టల్‌లో దారుణం ఘటన వెలుగులోకి వచ్చింది. పదోతరగతి విద్యార్థిపై సహచర విద్యార్థులు దాడికి పాల్పడారు. కామారెడ్డికి చెందిన విద్యార్థి అభిషేక్ రెడ్డిపై 8 నుంచి 10 మంది దాడి చేసినట్లు సమాచారం. కర్రలు, భోజనం ప్లేట్లతో కొట్టి.. బూట్లతో అభిషేక్ రెడ్డి ముఖంపై విద్యార్థులు తొక్కినట్లు తెలుస్తోంది. ఈ దాడి ధాటికి మెట్లపై నుంచి బాధితుడు కింద పడిపోయాడు. ఈ ఘటన విషయం తెలిసిన వెంటనే తల్లిదండ్రులకు స్కూల్ యాజమాన్యం సమాచారం అందజేశారు. అభిషేక్ రెడ్డిని కామారెడ్డి ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

# ట్రైనీ ఐపీఎస్ కేసును సిబిసిఐడికి బదిలీ చేయాలి

**హైదరాబాద్, ఆగస్ట్ 10:** ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి కేసును సీబీసీఐడీకి బదిలీ చేయాలని సీబీఐ మాజీ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు సూచించారు. ఈ మేరకు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌కు ఈ-మెయిల్ పంపారు.. ఈ కేసును సీబీసీఐడీ లేదా మరో స్వతంత్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ఉదయ్ కృష్ణారెడ్డి అరెస్టుపై పలు ప్రశ్నలను నాగేశ్వరరావు లేవనెత్తారు. పోష్ చట్టం కింద అంతర్గత విచారణ పూర్తికాకముందే ఉదయ్ కృష్ణారెడ్డిని ఎందుకు అరెస్టు చేశారని నాగేశ్వరరావు ప్రశ్నించారు. అతడిని అరెస్టు చేసే సమయంలో దర్యాప్తునకు సహకరించాడా?, సాక్షులను ప్రభావితం చేస్తాడా?, పరారయ్యే అవకాశముందా? వంటి అంశాలను పరిశీలించారా? అని నిలదీశారు. తొలుత బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుల్లో అత్యాచారం, హత్యాయత్నం ఆరోపణలు లేవని ప్రస్తావించారు. కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్టులో తీవ్ర ఆరోపణలు చేర్చారని పేర్కొన్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ స్వయంగా ఉదయ్ కృష్ణారెడ్డిని విచారించారని తెలిపారు. ఈ కేసు దర్యాప్తుపై తలెత్తిన అనుమానాలకు స్వతంత్ర విచారణతోనే తెరపడుతుందని డీజీపీకి సీబీఐ మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

# వరుణ యాగం చేస్తే.. మేం వాయు యాగం చేస్తాం

- కాంగ్రెస్ కొట్టుకుపోవాలంటూ యాగం చేస్తాం
- వానాకాలం చివర్లో ఇదేం కొత్త నాటకం?
- ఎల్‌నినో విషయం ముఖ్యమంత్రికి తెలియదా?
- హైడ్రా కమిషనర్ మజ్లిస్‌కు కొమ్ముకాస్తున్నారు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ధ్వజం

**హైదరాబాద్, ఆగస్టు 10:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్షాల కోసం వరుణ యాగం చేస్తే.. రాష్ట్రంలో కాంగ్రెస్ కొట్టుకుపోవాలని తాము 'వాయు యాగం' చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు వ్యంగ్యాస్త్రాలు సంధించారు. వానాకాలం చివరి దశకు వచ్చిన తర్వాత వరుణ యాగం పేరుతో ప్రభుత్వం కొత్త నాటకానికి తెరతీసిందని విమర్శించారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం ఉన్న విషయం ముఖ్యమంత్రికి తెలియదా అని ప్రశ్నించారు. సోమవారం మీడియాతో చిట్‌చాట్‌లో రాంచందర్‌రావు మాట్లాడుతూ.. వర్షాభావ పరిస్థితులపై ముందుగానే కార్యాచరణ



చేపట్టాల్సిన ప్రభుత్వం ఇప్పుడు యాగాలతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో వారికి అవసరమైన సహాయం అందించడంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సూచించారు. వరుణ యాగంతో వర్షాలు వస్తాయని ప్రభుత్వం భావిస్తే.. కాంగ్రెస్ కొట్టుకుపోవాలని తాము వాయు యాగం చేస్తామని ఎద్దేవా చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పైనా రాంచందర్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. హైకోర్టు చెప్పినా ఆయన తీరు మారడం లేదని, మజ్లిస్‌పై ఉన్న ప్రేమ ప్రజలపై లేదని ఆరోపించారు. నాదర్‌గుల్‌లో ఎకరాలకొద్దీ ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా హైడ్రా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వేల ఎకరాల ప్రభుత్వ భూములను కాపాడామని చెబుతున్న హైడ్రా.. వాటి వివరాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు. సల్కం చెరువులో అక్రమ నిర్మాణాల విషయంలోనూ చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించినా చూస్తూ ఊరుకునేది లేదని రాంచందర్‌రావు హెచ్చరించారు. క్యూర్ అంశంపై ఆగస్టు 15 తర్వాత బీజేపీ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించి, అనంతరం ఉద్యమాలను ఉధృతం చేస్తామని చెప్పారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ముగిసిన తర్వాత జీహెచ్ఎంసీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. ఇదిలావుండగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా రాంచందర్‌రావు తన నివాసంపై జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఆగస్టు 14న ట్యాంక్‌బండ్‌పై భారీ తిరంగా యాత్ర నిర్వహించనున్నట్లు ప్రకటించారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా ఈ యాత్రలో పాల్గొని దేశ ఐక్యతను చాటాలని కోరారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
మంగళవారం
11 ఆగస్టు 2026

## సంపాదకీయం




# జార్ఖండ్ ఆందోళనపై దృష్టి సారించాలి!

### పరీక్ష ఏదైనా.. లీకేజీ మాత్రం షరామామూలేనా?

**కష్టపడేది విద్యార్థులు.. భవిష్యత్తుతో ఆడుకునేది అక్రమార్కులు**

**సీబీఐ విచారణ కోరుతున్న అభ్యర్థులు.. కొనసాగుతున్న ఆందోళన**

**దోషులు ఊచలు లెక్కిస్తేనే పేపర్ లీకులకు అడ్డుకట్ట**

పరీక్ష ఏదైనా లీకులు సర్వ సాధారణం అవుతున్నాయి. పరీక్షలు రాసిన విద్యార్థులు నష్టపోతున్నారు. ఏడాదంతా కష్టపడి పరీక్ష రాసిన విద్యార్థుల భవిష్యత్ దెబ్బతింటోంది. కొందరు దగుల్బాజీలు కాసులకు కక్కుర్తి పడడంతో ఉజ్వల జీవితాన్ని విద్యార్థులు కోల్పోతున్నారు. మొన్నటి వరకు నీట్ గొడవ ముగిసిం దనుకుంటే.. ఇప్పుడు జార్ఖండ గొడవ మొదలయ్యింది. ఇక్కడ ఉన్నది ఇండియా కూటమి ప్రభుత్వమే. సిఎం హేమంత్ సోరేన్ ప్రభుత్వం కూడా ఇందుకు బాధ్యత వహించాలి. అలాగే రాహుల్ కూడా దీనిపై సమాధానం చెప్పాలి. కేంద్రంలో హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని అంటున్న రాహుల్ ముందు జార్థం÷–డ్ వెళ్లి అక్కడి విద్యార్థులకు సమాధానం చెబితే బాగుండేది. పరీక్షలు ఏవైనా, ఎక్కడ లీకైనా పాలకులు బాధ్యత వహించాల్సిందే. కేంద్రంలో మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనీమా చేసిన తరవాత, పరీక్షల సంస్కరణలకు ఎన్డిఎ సర్కార్ నడుం బిగించింది. నందన్ నీలేకన్ నేతృత్వంలో నిపుణుల కమిటీని వేసింది. లీకేజ్ వీరులపై చర్యలు తీసుకునేలా చట్టం తెచ్చింది. పదికోట్ల వరకు జరిమానా, పదేళ్ల వరకు జైలు శిక్ష విధించనున్నారు. ఇప్పుడు దీనిని ఉపయోగించి జార్ఖండ్ దోషులపై తొలి చర్యకు ఉపక్రమించాలి. ఇందుకోసం రాహుల్ కూడా పట్టుబట్టాలి. కేవలం అమిత్ షా రాజీనామా చేయాలన్న రాజకీయ డిమాండ్‌తో పార్లమెంట్‌ను అడ్డుకుంటూ విలువైన ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారు. పార్లమెంట్ నడవకుండా చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే కేంద్రం చర్యలు తీసుకున్నందున, ఇక జార్ఖండ్‌పై రాహుల్ దృష్టిసారిస్తే మంచిది.మరోవైపు జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ 14వ ప్రిలిమినరీ పరీక్షలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు ప్రారంభించింది. ఈ వ్యవహారంపై రాష్ట్ర సిఐడి నమోదు చేసిన కేసు ఆధారంగా గత వారం ఇది ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ నమోదు చేసింది. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు చేస్తున్న ఆందోళనల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. విద్యార్థులతో సుదీర్ఘంగా చర్చించిన అనంతరం, హేమంత్ సోరెన్ నేతృత్వంలోని జార్ఖండ్ ప్రభుత్వం నియామకాల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై సిఐడి, ఇడి దర్యాప్తులకు అంగీకరించింది. విద్యార్థులతో జరిగిన సమావేశం అనంతరం మంత్రి సుదివ్య కుమార్ సోను మాట్లాడుతూ.. విద్యార్థులు లేవనెత్తిన డిమాండ్లలో దాదాపు 98 శాతం అంశాలను ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. 2023, 2025 సంవత్సరాలకు సంబంధించిన బ్యాక్‌లాగ్ నియామక పరీక్షలతో పాటు 14వ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షను రద్దు చేయడానికి ప్రభుత్వం అంగీకరించిందని చెప్పారు. అయితే సర్వీస్ కమిషన్ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్షను రద్దు చేయడం, అలాగే నియామక పరీక్షల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న అవకతవకలపై సిబిఐ దర్యాప్తు జరిపించాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించలేదు. మంత్రి సుదివ్య కుమార్ సోను ప్రకారం.. సిజిఎల్ పరీక్షను రద్దు చేయాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం ఏకపక్షంగా అంగీకరించలేదని తెలిపారు. ఈ పరీక్ష హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాల పరిధిలో నిర్వహించబడినందున, ప్రభుత్వం స్వయంగా దానిని రద్దు చేయలేదని వివరించారు. అయితే ప్రభుత్వం తమ డిమాండ్లలో 98 శాతం అంగీకరించిందన్న వాదనను నిరసన చేస్తున్న విద్యార్థులు తిరస్కరించారు. విద్యార్థులు ప్రభుత్వ ప్రతిపాదనపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సోమవారం 'విధానసభ ఘెరావ్' నిర్వహించనున్నట్లు ప్రకటించారు. తమ ప్రధాన డిమాండ్ అయిన సిబిఐ దర్యాప్తును ప్రభుత్వం అంగీకరించలేదని విద్యార్థి నాయకులు పేర్కొన్నారు. తమ డిమాండ్ల లో 98 శాతం నెరవేర్చామని ప్రభుత్వం చెప్పడం వాస్తవానికి విరుద్ధమని వారు ఆరోపించారు. 13 పరీక్షలను రద్దు చేయాలని తాము డిమాండ్ చేయగా, ప్రభుత్వం కేవలం మూడు పరీక్షలను మాత్రమే రద్దు చేసిందని ఓ విద్యార్థి నాయకుడు పేర్కొన్నారు. అవకతవకలపై కేవలం సిఐడి దర్యాప్తుపైనే ఆధారపడటాన్ని కూడా విద్యార్థి నాయకులు విమర్శించారు. గతంలో సిఐఇడిపై పలు విషయాల్లో 'కప్పిపుచ్చే ప్రయత్నాలు' చేసిందనే ఆరోపణలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. నియామక పరీక్షల్లో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై నిజాలను వెలుగులోకి తీసుకురావడానికి, బాధ్యులను గుర్తించడానికి స్వతంత్ర దర్యాప్తు సంస్థతో విచారణ అవసరమని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వానికి తమ డిమాండ్లను శాంతి యుతంగా వివరించాలని విద్యార్థి నాయకులు సూచించారు.సర్వీస్ కమిషన్ 14వ ప్రిలిమినరీ పరీక్షలో అవకతవకల ఆరోపణలపై ఇడి రంగంలోకి దిగడంతో ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఒకవైపు ప్రభుత్వం ఇడి, సిఐడి దర్యాప్తులకు అంగీకరించగా, మరోవైపు విద్యార్థులు మాత్రం సిబిఐ వంటి స్వతంత్ర దర్యాప్తు కోరుతూ తమ ఆందోళన కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థులకు న్యాయం జరిగేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది. అవకతవకు కారకులైన వారిని ఊచలు లెక్క బెట్టేలా చేయాలి. అప్పుడే వారికి న్యాయం జరుగతుంది. అలాగే ఇతరులకు తగిన గుణపాఠం కలిగేలా కొత్త చట్టం ద్వారా చర్యలు తీసుకోవాలి.

# ఇంటింటా త్రివర్ణం రెపరెపలాడాలి

- 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనండి
- దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- వికసిత భారత్ సంకల్పాన్ని చాటుదామన్న ప్రధాని
- క్విట్ ఇండియా ఉద్యమ వీరుల త్యాగాలకు నివాళి



**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** జాతీయ పతాకం ప్రతి భారతీయుడికీ గర్వకారణమని, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో దేశ ప్రజలందరూ ఉత్సాహంగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రతి ఇంటిపైనా త్రివర్ణ పతాకం రెపరెపలాడాలని ఆకాంక్షించారు. జాతీయ పతాకం దేశ ప్రజలకు నిరంతర ప్రేరణశక్తిగా నిలుస్తుందని మోదీ పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కోట్లాది మంది ప్రజలు తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఎగురవేసేలా 2022 నుంచి 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈసారి కూడా ప్రతి ఒక్కరూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి 'వికసిత భారత్' సాధనకు ఉమ్మడి సంకల్పాన్ని చాటాలని కోరారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న స్వాతంత్ర్య సమరయోధుల ధైర్యసాహసాలను ఈ సందర్భంగా ప్రధాని స్మరించుకున్నారు. 1942 ఆగస్టు 9న మహాత్మా గాంధీ నాయకత్వంలో ప్రారంభమైన క్విట్ ఇండియా ఉద్యమం దేశ స్వాతంత్ర్య పోరాటానికి నిర్ణయాత్మక ప్రేరణ ఇచ్చిందన్నారు. ఉద్యమంలో పాల్గొన్న వారి త్యాగాలు, ధైర్యసాహసాలు ప్రతి భారతీయుడి మదిలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా వందేమాతరం గీతం ఆలాపనపై కేరళలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గతంలో అనుసరించిన విధంగానే గీతంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే ఆలపిస్తామని అక్కడి కొందరు నేతలు పేర్కొన్నారు.




## కేంద్ర మంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాల్సిందే

### అప్పటి వరకు పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన తప్పదు

**హెచ్చరించిన ప్రియాంక, రాహుల్ గాంధీ**

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 10:** పార్లమెంట్ మార్చ్ సందర్భంగా విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడంపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా వివరణ ఇవ్వాలని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ పట్టుబడుతోంది. ప్రకటన వచ్చేవరకు పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా తేల్చి చెప్పారు. సోమవారం పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లో ప్రియాంక గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. 'కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రకటన ఇచ్చే వరకు పార్లమెంట్‌లో ప్రతిష్ఠంభన కొనసాగుతుంది' అని అన్నారు. ఢిల్లీ ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సమాధానం చెప్పి తీరాల్సిందేనని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. విద్యార్థులపై దాడి ఘటనపై ప్రకటన ఇవ్వడానికి ఆయన పార్లమెంట్‌కు రావాల్సిందేనని పట్టుబట్టారు. పోలీసుల దాడిలో యువతులు, మైనర్లు గాయపడ్డారని అన్నారు. కాల్పులపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరగాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన దాడిపై ఎందుకు మౌనంగా ఉంటున్నారంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఈ 'నేరం'పై ఆయన సమాధానం చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రయాగ్‌రాజ్‌లో శనివారం జరిగిన 'ఛాత్రోంకీ గూంజ్' కార్యక్రమంలో ఓ విద్యార్థి నీట్‌కు సన్నద్ధమైన తాను సర్వం కోల్పోయానని, తనకు ఏ అవకాశాలు మిగల్లేదని ఆవేదనతో తెలిపాడని రాహుల్ వెల్లడించారు. దిల్లీలోని జంతర్ మంతర్‌వద్ద విద్యార్థుల ఆందోళన ముగిసి చాలా రోజులవుతునప్పటికీ ఇప్పటి వరకూ వారిపై పోలీసుల దాడికి సంబంధించి అమిత్ షా నోటి నుంచి ఒక్క మాట కూడా పెగల్లేదని రాహుల్ విమర్శించారు. మరోవైపు విద్యార్థులకు క్షమాపణ చెప్పడానికి బదులు వారిని క్షమిస్తున్నానంటూ ప్రధాని మోదీ తీరిక లేకుండా ఉన్నారని ఆక్షేపించారు.

## ట్రైబ్యునళ్ల సంస్కరణలకు లోక్‌సభ పచ్చజెండా

**విపక్షాల ఆందోళనల మధ్య బిల్లుకు ఆమోదం**

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** విపక్షాల ఆందోళనల నడుమ కీలకమైన ట్రైబ్యునళ్ల సంస్కరణల బిల్లుకు లోక్‌సభ సోమవారం ఆమోదం తెలిపింది. సభలో నెలకొన్న గందరగోళ పరిస్థితుల మధ్య బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు. అనంతరం లోక్‌సభను స్పీకర్ మంగళవారానికి వాయిదా వేశారు. దేశంలోని వివిధ ట్రైబ్యునళ్ల పనితీరును మరింత సమర్థంగా మార్చడంతోపాటు వాటి సారథులు, సభ్యుల నియామక ప్రక్రియలో పారదర్శకత, ఏకరూపత తీసుకురావడం ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. ట్రైబ్యునళ్లలో నియామకాలు, సభ్యుల అర్హతలు తదితర అంశాలకు సంబంధించి సుప్రీంకోర్టు గతంలో చేసిన సూచనలను పరిగణనలోకి తీసుకుని కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును రూపొందించింది. బిల్లులో ప్రధానంగా జాతీయ ట్రైబ్యునల్ కమిషన్ ఏర్పాటుకు సంబంధించిన విధివిధానాలను పొందుపరిచారు. ఒక ఛైర్‌పర్సన్‌తోపాటు నలుగురు సభ్యులతో కమిషన్ ఏర్పాటవుతుంది. సభ్యుల్లో ఇద్దరు న్యాయ రంగం నుంచి, మరో ఇద్దరు సాంకేతిక రంగం నుంచి ఉంటారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి లేదా హైకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తిని కమిషన్ ఛైర్‌పర్సన్‌గా నియమించేలా ప్రతిపాదించారు. ట్రైబ్యునళ్ల నిర్వహణ, నియామక ప్రక్రియను మరింత వ్యవస్థీకృతం చేయడంతోపాటు వాటి స్వతంత్రత, సమర్థతను పెంచడం కమిషన్ ప్రధాన లక్ష్యంగా ఉండనుంది. ట్రైబ్యునళ్లలో నియామకాలకు సంబంధించి ఇప్పటివరకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించి, దేశవ్యాప్తంగా ఒకే విధమైన వ్యవస్థను తీసుకురావడంలో ఈ సంస్కరణలు కీలకంగా మారనున్నాయి.

## పోలవరం తొలిదశకు కేంద్రం ఆమోదం

**సవరించిన అంచనా వ్యయం రూ.30,436.95 కోట్లు**

న్యూఢిల్లీ, ఆగస్ట్ 10: పోలవరం ప్రాజెక్టు తొలి దశ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిన సవరించిన అంచనా వ్యయం రూ.30,436.95 కోట్లని కేంద్ర జలశక్తి శాఖ వెల్లడించింది. తొలి దశలో 41.15 మీటర్ల వరకు ప్రాజెక్టు నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపింది. గత ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.12,620.53 కోట్ల నిధులు విడుదల చేసిందని పేర్కొంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా రూ.5,512.40 కోట్లు కేటాయించినట్లు వెల్లడించింది. పోలవరం ప్రాజెక్టు పురోగతిపై రాజ్యసభలో బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. ఈ సందర్భంగా స్పిల్‌వే నిర్మాణంలో ఇప్పటివరకు 96.87 శాతం మట్టి పనులు పూర్తయ్యాయని కేంద్ర జలశక్తి శాఖ తెలిపింది. కాంక్రీట్ పనులు 98.84 శాతం, స్టీల్ పనులు 92.9 శాతం మేర పూర్తయ్యాయని వెల్లడించింది. అలాగే ఎర్త్–కమ్–రాక్‌ఫిల్ డ్యామ్‌కు సంబంధించి కాంక్రీట్ పనులు 81.99 శాతం పూర్తయ్యాయని పేర్కొంది. ప్రధాన కాలువల తవ్వకం పనులు 98.96 శాతం పూర్తయ్యాయని వివరించింది. ప్రాజెక్టు తొలి దశలో మిగిలిన పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపింది. పోలవరం తొలి దశలో నిర్వాసిత కుటుంబాల పునరావాసం, పునరావాస ప్యాకేజీల అమలుపైనా కేంద్రం వివరాలు వెల్లడించింది. ఇప్పటివరకు 17,892 నిర్వాసిత కుటుంబాలను తరలించినట్లు తెలిపింది. ర్అండ్ఆర్ పరిహారం కింద రూ.1,373.01 కోట్లు పంపిణీ చేసినట్లు కేంద్రం పేర్కొంది. పునరావాసం, పునరావాస పనులకు అదనంగా రూ.1,581.08 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించింది. పోలవరం ప్రాజెక్టు తొలి దశను మార్చి 2026 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్రం తెలిపింది. అవసరమైతే మరో ఏడాది గడువు పొడిగించే వెసులుబాటు కూడా ఉందని స్పష్టం చేసింది.

# విద్యార్థుల ఆందోళనలపై చర్చకు సిద్ధం

- పోలీసు చర్యలపైనా పార్లమెంట్‌లో సమగ్రంగా చర్చిద్దాం
- విపక్షాలు సభను అడ్డుకోవద్దు: కిరణ్ రిజిజు
- హోంమంత్రి సమాధానం వినాలని సూచన
- అమిత్ షా వివరణకు విపక్షాల పట్టు

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** దేశ రాజధానిలోని జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలు, ఆ సందర్భంగా చోటుచేసుకున్న పోలీసు చర్యలపై పార్లమెంట్‌లో సమగ్ర చర్చకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు. విద్యార్థుల ఉద్యమానికి సంబంధించిన ప్రతి అంశంపైనా పూర్తి స్థాయిలో చర్చించేందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని సోమవారం వెల్లడించారు. అయితే చర్చ పేరుతో సభా కార్యక్రమాలను అడ్డుకోవడం సరికాదని విపక్షాలకు సూచించారు. "విద్యార్థుల ఉద్యమం, దానికి సంబంధించిన పరిణామాలపై పూర్తి స్థాయి, సవివరమైన చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. చర్చ జరుగుతున్న సమయంలో హోంమంత్రి లేదా ప్రభుత్వం సమాధానం ఇస్తుంటే విపక్షాలు అంతరాయం కలిగించకూడదు. హోంమంత్రి ఇచ్చే సమాధానాన్ని వినాలి" అని రిజిజు పేర్కొన్నారు.



**అమిత్ షా వివరణకు విపక్షాల పట్టు**

విద్యార్థుల ఆందోళనల సందర్భంగా ఢిల్లీలో పెల్లెట్ గన్స్ వినియోగించారన్న ఆరోపణలతోపాటు బిహార్‌లోని సివాన్‌లో ఏకే–47 వినియోగంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో వివరణ ఇవ్వాలని విపక్షాలు కొన్ని రోజులుగా డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందంటూ రిజిజు చేసిన ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఓ జాతీయ పత్రికలో రాసిన వ్యాసంలో విద్యార్థులపై పోలీసు చర్యలను తీవ్రంగా విమర్శించారు. ఘటనలపై హోంమంత్రి ఇప్పటివరకు విచారణకు ఆదేశించలేదని, కనీసం ప్రకటన కూడా చేయలేదని ఆరోపించారు. ఈ అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరపాలని విపక్షాలు నోటీసులు ఇస్తున్నప్పటికీ వాటిని తిరస్కరిస్తున్నారని పేర్కొన్నారు.

**పోలీసు చర్యలపై రాహుల్ ఆరోపణలు**

విద్యార్థుల ఆందోళనలను అణచివేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలకు పాల్పడిందని రాహుల్ ఆరోపించారు. ఢిల్లీలో విద్యార్థులపై బాష్పవాయువు ప్రయోగించడంతోపాటు మేకులు అమర్చిన లాఠీలు, పెల్లెట్ గన్స్ ఉపయోగించారని పేర్కొన్నారు. బిహార్‌లోని సివాన్‌లో ఏకే–47 వినియోగించారన్న అంశంపైనా ప్రశ్నలు లేవనెత్తారు. నీట్ పరీక్షలో అవకతవకలకు వ్యతిరేకంగా విద్యార్థులు చేపట్టిన ఆందోళనల విషయంలో ప్రభుత్వం పార్లమెంట్‌లో సమాధానం చెప్పాలని రాహుల్ డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల ఉద్యమం, పోలీసు చర్యలపై చర్చకు సిద్ధమంటూ కేంద్రం ప్రకటించడంతో పార్లమెంట్‌లో అధికార, ప్రతిపక్షాల మధ్య వాడీవేడి చర్చ జరిగే అవకాశముంది.

# పెద్ది సుదర్శన్రెడ్డి అకాల మరణం తీరని లోటు



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** పెద్ది సుదర్శన్రెడ్డి అకాల మరణం తీరని లోటని బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య అన్నారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు పెద్ది సుదర్శన్రెడ్డి దశదిన కర్మ కార్యక్రమానికి సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా సుదర్శన్రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని స్మరించుకున్నారు. అనంతరం పెద్ది సుదర్శన్రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెల్లం వేణు, సాంబ తదితరులు పాల్గొన్నారు.

# దశదిన కర్మకు హాజరైన డాక్టర్ మట్టా దయానంద్



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూరు మండల పరిధిలోని లచ్చన్నగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు గుజ్జర్లపూడి దేవేంద్ర దశదినకర్మ కార్యక్రమానికి సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దేవేంద్ర చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. దేవేంద్ర మృతి కాంగ్రెస్ పార్టీకి, గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేంసూరు మండల కాంగ్రెస్ నాయకులు, లచ్చన్నగూడెం గ్రామ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకాంత్ జాదవ్ జన్మదిన వేడుకలు





**ఉద్యమ కెరటం, జైనూర్:** సామాజిక సేవకులు, హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ అగ్రికల్చర్ డెవలప్మెంట్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీకాంత్ జాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణంలో నాయకులు కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి రంగాల అభివృద్ధికి శ్రీకాంత్ జాదవ్ చేస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. ఉచిత వైద్య శిబిరాలు, కంటి పరీక్షలు నిర్వహించి అద్దాల పంపిణీ, విద్యార్థులకు పోటీ పరీక్షల స్టడీ మెటీరియల్ అందించడం, వర్షాకాలంలో రహదారుల మరమ్మతులు చేపట్టడం వంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. మానవ సేవే మాధవ సేవ అనే లక్ష్యంతో పనిచేస్తున్న ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ కనక యాదవ్ రావు, అంబాజీ, జంగం ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, హెడ్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

# బంబారాలో అండర్పాస్ నిర్మించే వరకు పోరాటం ఆగదు

- అధికారుల నిర్లక్ష్యానికి ప్రజలే బుద్ధి చెబుతారు
- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి
- ప్రజల ప్రాణ భద్రతను అధికారులు తేలిగ్గా తీసుకోవడం సరికాదు
- బంబారా సర్పంచ్ బండారి కృష్ణాజీ




**ఉద్యమ కెరటం, వాంకిడి:** బంబారా గ్రామ పంచాయతీ పరిధిలో జాతీయ రహదారి నిర్మాణం వల్ల ప్రజల రాకపోకలకు తీవ్ర విఘాతం కలిగినా అధికారులు, ఎన్హెచ్ఏఐ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం దారుణమని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) తీవ్ర స్థాయిలో మండిపడింది. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి రహదారి నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఇక్కడ అండర్పాస్ బ్రిడ్జి, బస్ షెల్టర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతూ సీపీఐ, బంబారా గ్రామస్థుల ఆధ్వర్యంలో సోమవారం ప్రధాన రహదారిపై భారీ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి మాట్లాడుతూ బంబారా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే రీతిలో జాతీయ రహదారి నిర్మాణం జరిగిందన్నారు. ఒక వైపు నుంచి మరో వైపుకు వెళ్లేందుకు కనీస సదుపాయం కల్పించకపోవడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, రైతులు అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో రోడ్డు దాటాల్సి వస్తోందని, ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణాలు పోయాక గానీ అధికారులు స్పందించరా అని ప్రశ్నించారు. సమస్యల పరిష్కారానికి అధికారులకు ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా పట్టించుకోకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ఇకపై వినతులతో లాభం లేదని, ప్రజా ఉద్యమం ద్వారానే సమాధానం చెబుతామన్నారు. "పోరాడితే పోయేది ఏమీ లేదు... బానిస సంకెళ్లు తప్ప" అనే స్ఫూర్తితో బంబారా ప్రజల న్యాయమైన డిమాండ్ల కోసం సీపీఐ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బోయిరె ప్రకాష్ మాట్లాడుతూ సమస్యపై పలుమార్లు అధికారు దృష్టి కి తీసుకెళ్లినా స్పందించకపోవడం వల్లే ప్రజలు రోడ్డుపైకి రావాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా యంత్రాంగం కదిలి రాకపోతే ఆందోళనలను మండల స్థాయి నుంచి జిల్లా స్థాయికి తీసుకెళ్తామని, ఎన్హెచ్ఏఐ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. బంబారా గ్రామ సర్పంచ్ బండారి కృష్ణాజీ మాట్లాడుతూ ప్రజల ప్రాణ భద్రతను అధికారులు తేలిగ్గా తీసుకోవడం సరికాదన్నారు. సమస్య పరిష్కారం కోసం అవసరమైతే గ్రామంలోని ప్రజలనందరినీ సమీకరించి ఎన్హెచ్ఏఐ కార్యాలయం ముట్టడికి తరలివస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కొదురుపాక మహేష్, నాయకులు కిషోర్, జాడి ఖుచ్రు, నాంచార్ల సత్యానారాయణ, శ్రీరామ్ సుధాకర్, ఏఐవైఎఫ్ నాయకులు వర్కోల్ రాకేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఇన్చార్జి ఇటాంకర్ తిరుపతి, మండోకర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

- నూతన జిల్లా వైద్యాధికారి డా. నాగేంద్రకు అరిగెల సన్మానం



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** కొముురం భీం ఆసిఫాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ నాగేంద్రను సోమవారం భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అరిగెల నాగేశ్వరరావు, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి అరిగెల మల్లికార్జున్ ఘనంగా సన్మానించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారిగా అరిగెల నివాసానికి వచ్చిన డాక్టర్ నాగేంద్రకు పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అరిగెల నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల ప్రాంతంలో జన్మించిన ఒక వ్యక్తి, ఇక్కడి ప్రజలకు సుదీర్ఘకాలంగా వైద్య సేవలు అందిస్తూ నేడు జిల్లా వైద్యాధికారిగా ఉన్నత బాధ్యతలు స్వీకరించడం ఎంతో గర్వకారణమని, అభినందనీయమని కొనియాడారు. ప్రస్తుత వర్షాకాలం నేపథ్యంలో ఏజెన్సీ, ఆదివాసీ గ్రామాల్లో సీజనల్ అంటువ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని పేద, మారుమూల ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించి, జిల్లా వైద్య రంగానికి మంచి గుర్తింపు తీసుకు రావాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ సన్మాన కార్యక్రమంలో భాజపా నాయకులు కుందరపు బాలకృష్ణ, నవీన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మళ్ళీ కేసీఆర్ సీఎం కావాలని పాదయాత్ర

- జెండా ఊపి పాదయాత్ర ప్రారంభించిన ఆసిఫాబాద్ ఎమ్మెల్యే
- తెలంగాణకు కేసీఆరే శ్రీరామరక్ష : ఎమ్మెల్యే




**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** తెలంగాణ తొలి సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మళ్లీ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కావాలని కాంక్షిస్తూ కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలానికి చెందిన కేసీఆర్ అభిమానులు జాడి తిరుపతి, దుర్గం శంకర్ మంగళవారం వాంకడి నుండి ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రం వరకు పాదయాత్రను ప్రారంభించారు. ఈ పాదయాత్ర కార్యక్రమాన్ని ఆసిఫాబాద్ శాసనసభ్యురాలు కోవ లక్ష్మి జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రానికి మళ్లీ కేసీఆర్ రే ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. నాటి నుండి నేటి వరకు తెలంగాణ ప్రగతికి, ప్రజల సంక్షేమానికి కేసీఆర్ ఆలోచనలే శ్రీరామరక్ష అని కొనియాడారు. కేసీఆర్ పై ఉన్న అపారమైన అభిమానంతో ఈ సుదీర్ఘ పాదయాత్రకు శ్రీకారం చుట్టిన అభిమానుల సంకల్పాన్ని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ అహ్మద్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, కౌన్సిలర్ సలాం బీన్ అహ్మద్, వాంకిడి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ అజయ్, వాంకిడి సర్పంచ్ సతీష్, మాజీ సర్పంచ్ తుకారాం, రాజంపేట సర్పంచ్ బుర్స పోచయ్య, ఉప సర్పంచ్ మామిడి లక్ష్మి, యూత్ అధ్యక్షులు రాకేష్, బీ ఆర్ ఎస్ నాయకులు అన్సర్, అషుతోష్, శైలేష్, శ్రీనుతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని జంగం గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆదివాసీ ప్రజలు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంస్కృతి, సాంప్రదాయాలను చాటిచెప్పారు. ఆదివాసీల హక్కులు, భాష, సంస్కృతి, ఆచారాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆదివాసీ పోరాట వీరులు, మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయాలను భావితరాలకు అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ కుమ్ర భగవత్ రావ్, సర్పంచ్ పెందూర్ అనుసయా అర్జున్, ఉప సర్పంచ్ సయ్యద్ సజ్జద్ అలీ, వార్డు సభ్యులు జాదవ్ రవీందర్, కీర్తన్, భగవత్ రావ్, లక్ష్మణ్, మాజీ సర్పంచ్ శంరావ్ చందు, యూత్ సభ్యుడు దత్తు, గ్రామ పెద్ద లు, యువకులు పాల్గొన్నారు.



# లేబర్ కోడ్లు రద్దు చేయాలి

- కార్పొరేట్ పాలనపై పోరాడాలి
- 'జైల్ భరో'లో కామ్రేడ్ భూపాల్ డిమాండ్



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ :** కేంద్ర ప్రభుత్వం వెంటనే నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని, కార్పొరేట్ అనుకూల ప్రజావ్యతిరేక పాలనపై కార్మికులు, రైతులు ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా ఇన్చార్జి కామ్రేడ్ భూపాల్ డిమాండ్ చేశారు. సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల దేశవ్యాప్త పిలుపులో ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన 'జైల్ భరో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ రైతులు, కార్మికులు, సామాన్య ప్రజల ప్రయోజనాలను దెబ్బతీస్తోందని ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేసి, కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ, సామాజిక భద్రత కల్పించాలని కోరారు. అలాగే పంటలకు గిట్టుబాటు ధర దక్కేలా ఎంఎస్పీకి చట్టబద్ధత కల్పించడంతో పాటు సంపూర్ణ రైతు రుణమాఫీ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచి ఏటా వంద రోజుల పని హామీని పకడ్బందీగా అమలు చేయాలని, అంత్యోదయ కుటుంబాలకు అందిస్తున్న 35 కిలోల ఉచిత బియ్యాన్ని యథాతథంగా కొనసాగించాలని భూపాల్ స్పష్టం చేశారు. విద్యుత్ రంగ ప్రైవేటీకరణ విధానాలను విరమించుకొని, రైతులకు ఉచిత విద్యుత్‌ను అందించాలని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ నుంచి బస్టాండ్ చౌరస్తా వరకు కార్మికులు, రైతులు, ప్రజా సంఘాల నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ చౌరస్తా వద్ద రాస్తారోకో చేపట్టారు. పోలీసులు ఇరువర్గాల మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్, నాయకులు బాలకిషన్, శ్రీకాంత్, వెలిశాల కృష్ణమాచారి, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, ఐఎఫ్టీయూ నాయకుడు చాంద్ పాషా, టీయూసీఐ నాయకుడు తిరుపతి, ఐద్వా జిల్లా సంయుక్త కార్యదర్శి నంది పద్మతో పాటు వి. రాజేశ్వరి, స్వరూప, గంగామణి, జయ, తేకం ప్రభాకర్, మాడవి చంద్రకళ, భీంభాయ్, సంతోష్, బుద్దు సమ్మయ్య, నవీన, వనిత తదితరులు పాల్గొన్నారు.



# అధ్వానంగా సుర్దాపూర్–ఆసిఫాబాద్ రహదారి







- ప్రమాదాలకు నిలయంగా మారిన ప్రధాన రోడ్డు
- అధికారుల తీరుపై ప్రయాణికుల ఆగ్రహం

**ఉద్యమ కెరటం, కెరమెరి:** మండలంలోని సుర్దాపూర్ గ్రామం నుంచి కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోక పోవడంతో రహదారి పూర్తిగా గుంతలమయమై ప్రయాణికులకు నరకప్రాయంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో ప్రమాదాల ముప్పు పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అడుగడుగునా గుంతలే..**

రహదారి పొడవునా భారీ గుంతలు ఏర్పడి తారు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిలిచిపోవడంతో వాటి లోతు తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని వాహనదారులు, ప్రయాణికులు చెబుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి గాయాల పాలవుతున్న ఘటనలు తరచూ జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసిఫాబాద్కు వెళ్లే అంబులెన్సులు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వాపోతున్నారు.

**ప్రమాదకరంగా మారిన చెట్లు ..**

రహదారి దుస్థితికి తోడు ఇరువైపులా ఉన్న చెట్లు కూడా ప్రమాదకరంగా మారాయి. కొన్ని చెట్లు, కొమ్మలు రోడ్డుపైకి వాలిపోవడంతో ఎప్పుడు కూలిపోతాయోనన్న భయం ప్రయాణికుల్లో నెలకొంది. గాలివానల సమయంలో ప్రమాదం మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. భారీ వాహనాలు ప్రయాణించే సమయంలో కొమ్మలు అడ్డుతగిలి ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొంటున్నారు.

**అధికారుల నిర్ల క్ష్యం..**

ఈ మార్గంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు తరచూ ప్రయాణిస్తున్నప్పటికీ రహదారి దుస్థితిని పట్టించుకోక పోవడంపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎన్నోసార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా శాశ్వత పరిష్కారం లభించలేదని వాపోతున్నారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి తక్షణమే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

**శాశ్వత మరమ్మతులు చేపట్టాలి..**

సంబంధిత అధికారులు వెంటనే స్పందించి సుర్దాపూర్–ఆసిఫాబాద్ రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రోడ్డుపైకి వాలిన ప్రమాదకరమైన చెట్ల ను తొలగించి, గుంతలను పూడ్చి ప్రయాణాన్ని సురక్షితంగా మార్చాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి ప్రజల ప్రాణ భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# నాలుగు లేబర్ కోడ్ల ను రద్దు చేయాలి

**సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో**

**ఉద్యమ కెరటం, తాండూర్:** కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేసి, కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను యథాతథంగా కొనసాగించాలని సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజారాం, వ్యవసాయ కార్మిక సంఘం తాండూర్ మండల అధ్యక్షుడు వేల్పుల శంకర్ డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త జైల్ భరో నిరసన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం తాండూర్ తహశీల్దార్ కార్యాలయం నుంచి కార్మికులు, వ్యవసాయ కార్మికులు ర్యాలీగా బయల్దేరి మండల కేంద్రంలోని ఐబీ సర్వీస్ రోడ్డుకు చేరుకుని రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి ముందు, స్వాతంత్ర్యం అనంతరం కార్మికులు అనేక పోరాటాలు చేసి, ప్రాణత్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకువచ్చిందని విమర్శించారు. కొత్త చట్టాలు కార్మికుల హక్కులను హరించే విధంగా ఉన్నాయని, వాటిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో కరువు సమయంలో వలసలను నివారిస్తూ వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త చట్టంతో ఉపాధి కూలీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పాత ఉపాధిహామీ చట్టాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు. ఆదివాసీ, గిరిజనులతో పాటు ఇతర పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేసి, పేదలను ఆదుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు లీలారాణి, సత్యవతి, కె.విజయలక్ష్మి, ఎం.విజయలక్ష్మి, శారద, లక్ష్మి, మగ్దూం, జైనేని రాజయ్య, బొల్లం రాజేశం, రెడ్డి మల్లక్క, వరలక్ష్మి, జైనేని లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.





# తెలంగాణ గౌడ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్ గౌడ్




తెలంగాణ గౌడ యువజన సంఘం
Telangana gouda yuvajana sangam
(R. No. 1542/2016)
New adress :- H. No. 36-1-118,Dharmaram, Geesugonda, Warangal
State president
Gattu Naresh Goud
Cell: 8790239666
Email: tgyshelpdesk@gmail.com
Date: 09-08-2026
APPOINTMENT ORDER
Telangana gouda yuvajana Sangam has appointed [illegible] as [illegible] to (TGYS) with immediate effect.
A Sandeep
ARBASANI SANDEEP GOUD
District president -Rajanna sircilla
Telangana Gouda yuvajana Sangam
Adress
A Chandrashekar goud
s/o yella goud
Gambhiraopet

**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** తెలంగాణ గౌడ యువజన సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన కార్యదర్శిగా గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన ఆశయ్యగారి చంద్రశేఖర్ గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర నాయకత్వం ఆయనకు బాధ్యతలు అప్పగించింది. జిల్లా ప్రధాన కార్యదర్శిగా తనను నియమించడం పట్ల చంద్రశేఖర్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంఘం రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని గౌడ యువతను ఏకతాటిపైకి తీసుకువచ్చి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. గౌడ యువత విద్య, ఉపాధి, ఆర్థిక, సామాజిక అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు, గౌడ పెద్దలు, యువజన సంఘం సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చంద్రశేఖర్ గౌడ్ నియామకంపై గంభీరావుపేట మండల గౌడ సంఘం నాయకులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# గోపాల్రావుపేటలో నాలుగు ఆవుల అపహరణ



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ మండలం గోపాల్రావుపేట గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి నాలుగు ఆవులు అపహరణకు గురయ్యాయి. గ్రామానికి చెందిన తుపాకుల తిరుపతి తన మామిడి తోటలో కట్టి ఉంచిన నాలుగు ఆవులను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించినట్లు తెలిపారు. ఆవులు కనిపించకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో తాండూర్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పేర్కొన్నారు. అపహరణకు గురైన ఆవుల ఆచూకీ తెలిసిన వారు సెల్:8179583316 నంబర్కు సమాచారం అందించాలని కోరారు.

# నేడు ఆదిలాబాద్లో టీసీఎస్ మెగా క్యాంపస్ డ్రైవ్

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఐటీ సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు మెగా క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 11న ఈ డ్రైవ్ నిర్వహించనున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని నలంద డిగ్రీ కళాశాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు డ్రైవ్ కొనసాగుతుందని తెలిపారు. 2024, 2025, 2026 సంవత్సరాల్లో బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ పూర్తి చేసిన, 2026లో డిగ్రీ పూర్తి చేయనున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. అభ్యర్థులు ముందస్తుగా నమోదు చేసుకునేందుకు అధికారిక ప్రకటనలోని క్యూఆర్ కోడ్ను చేసి, లేనియెడల https://surl.li/aoenxf లింక్ ద్వారా ముందస్తుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. క్యాంపస్ డ్రైవ్కు సంబంధించిన ఇతర వివరాల కోసం 9502786438, 9849913061 నంబర్ల ను సంప్రదించాలని వివరించారు.

# మోదీ విధానాలకు వ్యతిరేకంగా భారీ రాస్తా రోకో

- హన్మకొండలో రైతు, కార్మిక సంఘాల ఆందోళన.. నాయకుల అరెస్టు




**ఉద్యమ కెరటం, హన్మకొండ:** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) ఆధ్వర్యంలో రైతు, కార్మిక, ప్రజా సంఘాలు హన్మకొండ కలెక్టర్ బంగ్లా సెంటర్లో సోమవారం భారీ రాస్తారోకో నిర్వహించారు. జైల్భరో పిలుపులో భాగంగా చేపట్టిన ఈ ఆందోళనతో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు రంగప్రవేశం చేసి ఆందోళనకారులను అరెస్టు చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈ సందర్భంగా ఎస్కేఎం జిల్లా కన్వీనర్లు ప్రభాకర్రెడ్డి, ఎన్.రెడ్డి హంసారెడ్డి, కొడగాని శివాజీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, ఏఐఎఫ్డీఎస్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం నాగార్జున, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మంద సంపత్ మాట్లాడుతూ.. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు, నాలుగు లేబర్ కోడ్స్ వంటి విధానాలతో కేంద్ర ప్రభుత్వం రైతులు, కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. పెరిగిన పెట్టుబడి ఖర్చులకు అనుగుణంగా పంటలకు గిట్టుబాటు ధర లభించక రైతులు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారని అన్నారు. విదేశీ వ్యవసాయ ఉత్పత్తులను దేశీయ మార్కెట్లోకి అనుమతించే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగ ఉద్యమ సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పంటలకు మద్దతు ధర కల్పించే చట్టం, రైతులకు రుణ విముక్తి చట్టం తీసుకురావాలని కోరారు. అలాగే రైతులకు, వ్యవసాయ రంగానికి నష్టం కలిగించే విద్యుత్, విత్తన చట్టాలను ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు. కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్స్ను రద్దు చేసి పాత కార్మిక చట్టాలను అమలు చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని యథావిధిగా అమలు చేయాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతు, కార్మిక సమస్యలను పరిష్కరించకపోతే రైతులు, కార్మికులు, ప్రజలను ఐక్యం చేసి మరింత పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాస్ సావిత్రి, ప్రేమలత, రజిత, రాములు, వెంకట్, నాగార్జున, మంద సంపత్, రాగుల రమేష్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



# ఇంటిపై త్రివర్ణ ం... గుండెల్లో దేశభక్తి

- హర్ ఘర్ తిరంగాలో భాగస్వాములైన బీజేపీ సీనియర్ నాయకులు డా. కొత్త పల్లి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ అనిత



**ఉద్యమ కెరటం, కాగజ్ నగర్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా కాగజ్నగర్ పట్టణంలోని బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, కాగజ్నగర్ మున్సిపల్ వైస్ చైర్మన్ కొత్తపల్లి అనిత వారి నివాసం వద్ద ఘనంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్రివర్ణ పతాకం ప్రతి భారతీయుడి గుండెల్లో గర్వాన్ని, దేశభక్తిని నింపే పవిత్ర ప్రతీక అని కొనియాడారు. మన దేశ స్వాతంత్ర్యానికి, ఐక్యతకు, సమగ్రతకు జాతీయ జెండా నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను సైతం అర్పిం చిన మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ ప్రగతిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

# ఉద్యోగాల పేరుతో రూ.5.9 లక్షల మోసం

## జూనియర్ అసిస్టెంట్పై కేసు నమోదు




**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి పలువురి వద్ద నుంచి డబ్బులు వసూలు చేసిన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ ముకీద్ అహ్మద్ పై కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ టూటౌన్ సీఐ నాగరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. 2024 డిసెంబర్ 16న కాంట్రాక్ట్ ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూకు హాజరైన అంకోలి గ్రామానికి చెందిన గుగ్గిల లావణ్యను నిందితుడు పరిచయం చేసుకున్నాడు. మహాత్మా జ్యోతిబాఫూలే హాస్టల్లో వార్డెన్ ఉద్యోగం, ఇతర శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి రూ.లక్ష డిమాండ్ చేశాడు. దీంతో బాధితురాలు తన మామతో కలిసి ఎంఈఓ కార్యాలయం ఎదుట నిందితుడికి రూ.45వేల నగదు అందజేసింది. అయితే ఉద్యోగం ఇప్పించకపోవడంతో పాటు డబ్బులు తిరిగి ఇవ్వకుండా కాలయాపన చేయడంతో ఆమె ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా.. నిందితుడు మొత్తం ఏడుగురి వద్ద నుంచి సుమారు రూ.5.9 లక్షలు వసూలు చేసినట్లు తేలిందన్నారు. బాధితులు సంతోష్ వద్ద రూ.50వేలు, రామకాంత్ వద్ద రూ.95 వేలు, గులాబ్సింగ్ వద్ద రూ.10వేలు, జ్ఞానేశ్వర్ వద్ద రూ.40వేలు, నారాయణరెడ్డి వద్ద రూ.50వేలు, వహీద్ టైలర్ వద్ద రూ.30వేలు, అతీక్ వద్ద రూ.3లక్షలు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే నమ్మి నగదు ఇవ్వవద్దని, ఇలాంటి మోసాలకు గురైతే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# బాలానగర్ లో ఘనంగా అమ్మవారి తొట్టె ల ఊరేగింపు

**ఉద్యమ కెరటం, హైదరాబాద్;** తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల ఉత్సవాల సందర్భంగా బాలానగర్ పరిధిలోని ఇంద్రానగర్, గౌతమ్ నగర్ సాయినగర్, మరియు రాజు కాలనీల్లో అమ్మవారి తొట్టెలు, పలారం బండి ఊరేగింపులు అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ జానపద, సాంస్కృతిక కళాబృందాల ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు విచ్చేసి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాలనీ ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో విలసిల్లాలని అమ్మవారిని ప్రార్థించినట్లు వెల్లడించారు. అనంతరం, ఊరేగింపులో నెలకొన్న ఆధ్యాత్మిక ఉత్సాహంలో భాగంగా ఆయన స్వయంగా భక్తులతో కలిసి డప్పుల చప్పుళ్లకు, దరువులకు ఉత్సాహంగా నృత్యం చేసి అందరిలో జోష్ నింపారు. కాలనీ వాసులు, ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఈ వేడుకలు ఘనంగా ముగిశాయి.

# ప్రజాసంఘాల ఆధ్వర్యంలో జైల్భరో

- నేతలు, కార్యకర్త లను అడ్డుకున్న పోలీసులు




**ఉద్యమ కెరటం, సత్తుపల్లి :** కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం అనుబంధ సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం వేంసూరు మండలం మర్లపాడు గ్రామంలో జైల్భరో కార్యక్రమం నిర్వహించారు. అఖిల భారత కమిటీ పిలుపులో భాగంగా ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, కార్మికులు, రైతులు భారీగా మానవహారం చేపట్టారు. వేంసూరులోని ఎర్ర రామయ్య భవనం నుంచి మర్లపాడు నాలుగు రోడ్ల కూడలి వరకు నాయకులు, కార్యకర్తలు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం మర్లపాడు సెంటర్లో సీఐటీయూ మండల కార్యదర్శి మల్లూరు చంద్రశేఖర్ అధ్యక్షతన సభ నిర్వహించారు. రైతు సంఘం డివిజన్ కార్యదర్శి రావుల రాజబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి కీలకంగా పనిచేస్తున్న కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల హక్కులను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం హరిస్తోందని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా విధానాలను రూపొందిస్తూ కార్మిక, కర్షక వర్గాలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. నాటి క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ప్రజలు దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. ఎస్సై బి.కవిత ఆధ్వర్యంలో పోలీసులు పలువురు ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని పోలీస్స్టేషన్కు తరలించారు. అనంతరం ప్రజాసంఘాల నాయకులు జైల్భరో కార్యక్రమం విజయవంతమైందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కొత్త సత్యనారాయణ, అర్వపల్లి గోపాలరావు, సీపీఎం మండల కార్యదర్శి అర్వపల్లి జగన్మోహన్రావు, సుశీల, డంకర శ్రీను, కావూరి సుదర్శన్, సీఐటీయూ అనుబంధ అంగన్వాడీలు, హమాలీలు, ఆటో డ్రైవర్లు, బిల్డింగ్ వర్కర్లు, పెట్రోల్ బంక్ కార్మికులు, మెకానిక్లు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దళితులకు కాంగ్రెస్ పార్టీ నే శ్రీరామరక్ష

- టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మెన్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ఎవరి జనాభా ఎంతో వారికి అంత భాగస్వామ్యం అనే నినాదంతోనే ముందుకు వెళ్తుందని టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఎస్సీ విభాగం జిల్లా కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో దళితులు, గిరిజనులు, మైనార్టీలు చాలా బలంగా ఉన్నారని, దళితులు ఏ వైపు ఉంటే అధికారం ఆ వైపు ఉంటుందని పేర్కొన్నారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ దళితులకు అనేక అబద్ధపు ఆశలు చూపించి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. నేడు దేశ వ్యాప్తంగా దళితులు, బలహీన వర్గాలపై దాడులు జరగడానికి మతతత్వ పార్టీలే కారణమని ఆరోపించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగం దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుతుంటే, కాంగ్రెస్ పార్టీ ఆ రాజ్యాంగ స్ఫూర్తితో రిజర్వేషన్లు కల్పించిందని గుర్తుచేశారు. ఇందిరా గాంధీ అంటేనే ఒక ధైర్యమని, దళితులు ఉన్నత చదువులు చదువుకోవాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ రిజర్వేషన్లు ఇచ్చిందని, 1973లోనే ఇందిరాగాంధీ దళితులకు ఇండ్ల స్థలాలు, ఇండ్లు కేటాయించారని తెలిపారు. ఆ తర్వాత దేశంలో సాంకేతిక విప్లవం, డిజిటలైజేషన్, కంప్యూటరీకరణ వేగంగా విస్తరించాయన్నారు. పీవీ నరసింహారావు అనంతరం సోనియా గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ దేశంలో అధికారం సాధించిందన్నారు. దళితుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీనే శ్రీరామరక్ష అని, అందుకే రాష్ట్ర క్యాబినెట్లో ఐదుగురు దళిత మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానం కల్పించారని వివరించారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకుందని, మాదిగ, మాల అన్నదమ్ములుగా కలిసి ఉండాలనేదే ప్రభుత్వ ఆకాంక్ష అని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్, బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్, ఏఐసీసీ జాతీయ కోఆర్డినేటర్ సిద్దార్థ్ హితంత్రీ, జిల్లా గ్రంథాలయం చైర్మెన్ మల్లెపూల నర్సయ్య, ఆసిఫాబాద్ ఇంచార్జ్ శ్యామ్ నాయక్, మాజీ డీసీసీ అధ్యక్షులు సాజిద్ ఖాన్, సంజీవరెడ్డి, ఎస్సీ డిపార్ట్ మెంట్ జిల్లా అధ్యక్షులు (సభ అధ్యక్షులు) కె.పరమేశ్వర్, రాష్ట్ర టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్లు కూర్మ మహేందర్, దుర్గం శేఖర్, మాజీ ఫ్లోర్ లీడర్ బండారి సతీష్, కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల జిల్లా, రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిజాయితీ గల పోరాట యోధులకు పార్టీ లో సముచిత స్థానం

- ఎమ్మెల్యే డాక్ట ర్ కవ్వంపల్లి సత్యనారాయణ
- కాంగ్రెస్ ఎస్సీ డిపార్ట్ మెంట్ జిల్లా అధికార ప్రతినిధిగా కదరపు దేవిదాస్

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** నిజాయితీగా ప్రజా సమస్యలపై పోరాడే నాయకులకు కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం ఉంటుందని టీపీసీసీ రాష్ట్ర ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బేల మండలం సాంగిడి గ్రామానికి చెందిన కదరపు దేవిదాస్ను ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ జిల్లా అధికార ప్రతినిధిగా నియమించారు. సోమవారం ఆదిలాబాద్లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్మెంట్ విస్తృత స్థాయి సమావేశంలో డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చేతుల మీదుగా దేవిదాస్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవిదాస్ మొదటి నుంచి పార్టీ పోరాటాల్లో భాగస్వామిగా ఉంటూ ముందుకు సాగారని తెలిపారు. ఆయనకు ఉన్న రాజకీయ చతురతతో ప్రత్యర్థుల అబద్ధాలను ఎండగడుతూ, దళితుల బలమైన గొంతుకగా నిలవాలని ఆకాంక్షించారు. పార్టీ బలోపేతానికి ఆయన సేవలు ఉపయోగపడతాయని, సమాజంలో వెనుకబడిన వర్గాల హక్కుల కోసం, కాంగ్రెస్ పార్టీ ఆశయాల సాధన కోసం నిరంతరం కృషి చేస్తారనే నమ్మకం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కదరపు దేవిదాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, డీసీసీ అధ్యక్షుడు నరేష్ జాదవ్, బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్, ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి కంది శ్రీనివాస్రెడ్డి, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు పరమేశ్వర్, రాష్ట్ర టీపీసీసీ ఎస్సీ విభాగం వైస్ చైర్మన్లు మహేందర్, దుర్గం శేఖర్, రాష్ట్ర, జిల్లా నాయకులు, ఎస్సీ డిపార్ట్మెంట్ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, కాంగ్రెస్ పార్టీ విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తానని స్పష్టం చేశారు.



# నడుము చుట్టుకొలత అధికంగా ఉండే మహిళలకు గుండె పోటు ప్రమాదం ఎక్కువ.. అధ్యయనంలో వెల్లడి..

ఊబకాయం గుండె సంబంధిత అనేక సమస్యలకు కారణమవుతుందని ఇప్పటికే పలు అధ్యయనాలు సూచించాయి. అయితే శరీరంలో కొవ్వు ఏ ప్రాంతంలో ఎక్కువగా పేరుకుపోతుందన్న విషయం కూడా గుండె ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తుందని తాజా అధ్యయనం వెల్లడించింది. ముఖ్యంగా నడుము, తుంటి చుట్టుకొలత ఎక్కువగా ఉన్న మహిళల్లో గుండెపోటు వచ్చే ప్రమాదం అధికంగా ఉండే అవకాశాలు ఉంటాయని పరిశోధకులు గుర్తించారు. ఈ అధ్యయనం కోసం ఇంగ్లాండ్, స్కాట్లాండ్, వేల్స్‌కు చెందిన 4,79,610 మంది ఆరోగ్య సమాచారాన్ని పరిశీలించారు. అధ్యయనం ప్రారంభంలో వారి వయస్సు 40 నుంచి 69 సంవత్సరాల మధ్య ఉండగా, సగటు వయస్సు 56 సంవత్సరాలుగా ఉంది. పాల్గొన్నవారిలో ఎక్కువ మంది అధిక బరువుతో ఉన్నప్పటికీ, అప్పటివరకు వారికి గుండె జబ్బుల చరిత్ర లేదు. సగటున ఏడేళ్ల పాటు వారిని పరిశీలించగా, ఈ కాలంలో 5,710 మంది గుండెపోటుకు గురైనట్లు గుర్తించారు.

## నడుము చుట్టుకొలత ఎక్కువగా ఉంటే..

నడుము చుట్టుకొలత అసాధారణంగా ఎక్కువగా ఉన్న మహిళల్లో గుండెపోటు ప్రమాదం మరింత ఎక్కువగా ఉన్నట్లు అధ్యయనంలో తేలింది. అలాగే నడుము-తుంటి నిష్పత్తి ఎక్కువగా ఉన్న మహిళలు కూడా అధిక ప్రమాదంలో ఉన్నట్లు గుర్తించారు. పురుషుల్లోనూ పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోయే యాపిల్ షేప్ శరీరాకృతి కనిపించినప్పటికీ, ఇదే తరహా శరీరాకృతి ఉన్న మహిళలతో పోలిస్తే గుండెపోటు ప్రమాదం మహిళల్లో ఎక్కువగా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఊబకాయం గుండె జబ్బులకు ఒక ముఖ్యమైన ప్రమాద కారకమన్న విషయం ఇప్పటికే తెలిసిందే. అయితే శరీరంలోని వివిధ భాగాల్లో కొవ్వు పేరుకుపోయే విధానం గుండె ఆరోగ్యంపై చూపే ప్రభావాన్ని ఈ అధ్యయనం మరింత స్పష్టంగా చూపించింది. ముఖ్యంగా పొట్ట చుట్టూ పేరుకుపోయే కొవ్వు ఆరోగ్యంపై ఎక్కువ ప్రభావం చూపే అవకాశం ఉంటుందని పరిశోధకులు చెప్పారు. ఊబకాయం అంటే శరీరంలో అవసరానికి మించి కొవ్వు పేరుకుపోయే పరిస్థితి. అధిక బరువు, ఊబకాయం వల్ల గుండె జబ్బులతోపాటు మధుమేహం, కీళ్ల సమస్యలు, కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదం కూడా పెరుగుతుందది. ముఖ్యంగా పొట్ట చుట్టూ పేరుకుపోయే అంతర్గత కొవ్వు శరీరంలో వాపు వంటి ప్రక్రియలను ప్రేరేపించి, మధుమేహం, కరోనరీ ఆర్టరీ వ్యాధి వంటి సమస్యల ప్రమాదాన్ని పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు.




## తెల్ల బియ్యం వద్దు..

బరువును నియంత్రించుకోవాలనుకునేవారు శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లకు బదులుగా సంపూర్ణ ధాన్యాలను ఎంచుకోవడం మంచిది. బజ్రా, రాగి, మొక్కజొన్న, జొన్న వంటి సంపూర్ణ ధాన్యాలను ఆహారంలో తరచూ చేర్చుకోవచ్చు. తెల్ల బియ్యానికి బదులుగా ఎరుపు, నలుపు లేదా బ్రౌన్ రైస్‌ను ఎంచుకోవచ్చు. వీటిని అల్పాహారంలో గంజి రూపంలో కూడా తీసుకోవచ్చు. ధాన్యాల మాదిరిగానే పొట్టు తొలగించని సంపూర్ణ పప్పుధాన్యాలు కూడా ఆరోగ్యకరమైన ఎంపికగా ఉన్నాయి. రాజ్మా, శనగ పప్పు వంటి వాటిని ఆహారంలో చేర్చుకోవచ్చు. వీటిని కూరలుగా వండుకోవడంతోపాటు మొలకల రూపంలో లేదా సూప్‌లలో కూడా తీసుకోవచ్చు. బరువు తగ్గే ప్రయత్నంలో ఉన్నవారు రెడ్ మీట్‌కు బదులుగా కొవ్వు తక్కువగా ఉండే ప్రొటీన్ వనరులను ఎంచుకోవాలి. చికెన్, సాల్మన్ వంటి ఆహారాలను తీసుకోవచ్చు. ప్రతి భోజనంలో తగినంత ప్రొటీన్ ఉండేలా చూసుకోవడం బరువు నియంత్రణలో ఉపయోగకరంగా ఉంటుంది. ట్రాన్స్ ఫ్యాట్స్‌కు దూరంగా ఉండటం కూడా చాలా ముఖ్యం. ఫాస్ట్‌ఫుడ్, ఇన్‌స్టంట్ ఫుడ్, డీప్ ఫ్రైడ్ జంక్ ఫుడ్, కుకీలు, బర్గర్లు, నూడుల్స్, కొన్ని పాస్తా వంటి ప్రాసెస్డ్ ఆహారాల్లో ట్రాన్స్ ఫ్యాట్స్ ఉండే అవకాశం ఉంటుంది. వీటిని తరచూ తీసుకోవడం ఊబకాయం, ఇతర ఆరోగ్య సమస్యల ప్రమాదాన్ని పెంచుతుంది.

## చక్కెర వాడకాన్ని తగ్గించాలి..

చక్కెర వినియోగాన్ని కూడా పరిమితం చేయాలి. రోజువారీ మొత్తం కేలరీల్లో చక్కెర వాటా 10 శాతానికి మించకుండా చూసుకోవాలి. అంతకంటే 5 శాతం లోపులో ఉంచితే మరింత మంచిది. మనం తీసుకునే అనేక ఆహారాల్లో సహజంగా ఉండే చక్కెరతోపాటు అదనంగా చేర్చిన చక్కెర కూడా ఉంటుంది. కనుక ఆహారాన్ని ఎంచుకునేటప్పుడు చక్కెర పరిమాణంపై కూడా శ్రద్ధ పెట్టడం అవసరం. అయితే ఈ అధ్యయనం పరిశీలనాత్మకమైనదే తప్ప నియంత్రిత ప్రయోగం కాదు. అంటే శరీర బరువు లేదా కొవ్వు ఏ ప్రాంతంలో పేరుకుపోవడం వల్ల నేరుగా గుండెపోటు వస్తుందని ఈ అధ్యయనం నిర్ధారించలేదు. మరో పరిమితి ఏంటంటే.. అధ్యయనంలో పాల్గొన్నవారంతా తెల్ల జాతికి చెందినవారు. ఇతర జాతులు లేదా భిన్నమైన జనాభాలో ఫలితాలు వేరుగా ఉండే అవకాశం ఉంటుందని పరిశోధకులు పేర్కొన్నారు. అందువల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి శరీర బరువుతోపాటు నడుము చుట్టుకొలతను కూడా గమనించడం, సమతుల్యమైన ఆహారం తీసుకోవడం, ప్రాసెస్డ్ ఫుడ్స్, ట్రాన్స్ ఫ్యాట్స్, అధిక చక్కెరను తగ్గించడం వంటి జీవనశైలి మార్పులు చేయడం ముఖ్యమని నిపుణులు తెలియజేస్తున్నారు.

# రాత్రి పడుకునే ముందు ఇవి తింటే ఆరోగ్యానికి హానికరం..!



మంచి ఆరోగ్యానికి నిద్ర చాలా అవసరం. కానీ నేటి జీవితంలో చాలామంది నిద్రలేమి (Sleeplessness) తో బాధపడుతున్నారు. మనం తినే ఆహారం (Food) కూడా నిద్రపై ప్రభావం చూపుతుంది. నిద్రలేమీతో క్రమక్రమంగా అనేక అనారోగ్య సమస్యలు చుట్టుముడుతాయి. అందుకే రాత్రిపూట కొన్ని ఆహారాలను తీసుకోవడం మానుకుంటే కంటినిండా నిద్రపోవచ్చు. మరి రాత్రి పడుకునే ముందు తినకూడని ఆ ఆహారపదార్థాలేవో ఇప్పుడు తెలుసుకుందాం..

## కెఫీన్ ఉన్నవి

కాఫీ, టీ, ఎనర్జీ డ్రింక్స్, చాక్లెట్లు వంటి వాటిలో కెఫీన్ ఉంటుంది. ఇవి మెదడును చురుకుగా ఉంచి నిద్ర పట్టకుండా చేస్తాయి. కాబట్టి రాత్రి పడుకునే ముందు వీటికి దూరంగా ఉండటం మంచిది.

## మసాలాలు, వేపుళ్లు

మసాలాలు, వేయించిన ఆహారం తింటే కడుపులో మంట, ఎసిడిటీ కలుగుతుంది. దాంతో నిద్రకు ఇబ్బంది కలుగుతుంది. పిజ్జా, బర్గర్, మటన్ వంటి ఆహారాలు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి ఇవి కూడా నిద్రకు అంతరాయం కలిగిస్తాయి. అందుకే వాటికి దూరంగా ఉండాలి.

## చక్కెర పదార్థాలు

అదేవిధంగా కేకులు, స్వీట్లు తింటే రక్తంలో చక్కెర పెరిగి నిద్రకు భంగం కలుగుతుంది. కాబట్టి వాటిని కూడా రాత్రి పడుకునే ముందు అస్సలు తినకూడదు.

## ఎసిడిటీ ఫుడ్స్

నిమ్మకాయ, నారింజ, టమోటా వంటి వాటిని రాత్రిపూట తింటే గుండెల్లో మంట కలుగుతుంది. ఎందుకంటే వాటిలో ఆమ్లాలు ఉంటాయి. అందుకే మంటగా అనిపిస్తుంది. అదేవిధంగా బ్రకోలీ, క్యాబేజీ, కాలీఫ్లవర్ వంటివి తింటే కడుపులో గ్యాస్ ఏర్పడి నిద్రకు ఇబ్బంది కలుగుతుంది.

## ఆల్కహాల్

మద్యం తాగితే మొదట నిద్ర వచ్చినట్టు అనిపించినా తర్వాత నిద్ర సరిగా ఉండదు. కాబట్టి రాత్రి పడుకునే ముందు మద్యానికి దూరంగా ఉండటం మంచిది.

# మీ వయస్సు 40 దాటిందా.. అయితే ఈ పరీక్షలు తప్పక చేయించుకోవాలి

వయస్సు 40 ఏండ్లకు పైబడిన వారు తప్పనిసరిగా కొన్ని రకాల ఆరోగ్య పరీక్షలు (Health Checkups) చేయించుకోవాల్సి ఉంటుంది. నలభై ఏళ్ల తర్వాత శరీరంలో చాలా మార్పులు వస్తాయి. అందుకే ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం చాలా ముఖ్యం. దీనివల్ల కొన్ని రకాల అనారోగ్య సమస్యల (Health Issues) ను ప్రారంభ దశలోనే గుర్తించి సరైన చికిత్స పొందే అవకాశం ఉంటుంది. దాంతో ఆరోగ్యంగా జీవించగలుగుతాం. అయితే 40 ఏళ్ల తర్వాత తప్పనిసరిగా చేయించుకోవాల్సిన ముఖ్యమైన ఆరోగ్య పరీక్షలు ఏవో ఇప్పుడు తెలుసుకుందాం..



## బ్లడ్ షుగర్ టెస్ట్

ఒకప్పుడు వయస్సు పైబడిన వారు మాత్రమే మధుమేహం బారినపడే వారు. ఇప్పటి ఆహారపు అలవాట్లు, ఉరుకులు పరుగుల జీవనశైలితో చిన్న వయస్సులోనే మధుమేహం బారిన పడుతున్నారు. అందుకే కనీసం 40 ఏళ్లు దాటిన తర్వాతనైనా ప్రతి ఒక్కరూ బ్లడ్ షుగర్ పరీక్షలు చేయించుకోవడం మంచిది.

## కొలెస్ట్రాల్ టెస్ట్

ఒకప్పటితో పోల్చిచూస్తే ఇప్పటి ఆహారపు అలవాట్లలో చాలా తేడాలు వచ్చాయి. జనం ఇన్‌స్టంట్ ఫుడ్స్‌కు బాగా అలవాటుపడ్డారు. దాంతో చిన్న వయస్సులోనే ఊబకాయం వస్తున్నది. రక్తంలో కొవ్వు శాతం పెరుగుతోంది. ఇది గుండె జబ్బులకు దారితీస్తుంది. అందుకే 40 ఏండ్లు దాటిన వారు కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించుకోవడం ఉత్తమం.

## బీపీ టెస్ట్

ప్రస్తుతం జీవనశైలి పూర్తిగా ఒత్తిళ్లతో కూడుకుని ఉన్నది. మనిషులు సంపాదన వేటలో పడి మానసిక ఒత్తిళ్లలో చిక్కుకుంటున్నారు. ఉదయం లేచింది మొదలు రాత్రి నిద్రించే వరకు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. సరైన విశ్రాంతి లేక బీపీ, షుగర్ లాంటి జీవనశైలి వ్యాధులబారిన పడుతున్నారు. కొందరు ఆహారపు అలవాట్ల కారణంగా ఈ వ్యాధులు తెచ్చుకుంటున్నారు. కాబట్టి 40 ఏండ్ల తరచూ బీపీ పరీక్షలు చేయించకోవడం మంచిది.

## థైరాయిడ్ టెస్ట్

బీపీ, షుగర్ మాదిరిగానే థైరాయిడ్ కూడా జీవనశైలి వ్యాధి. ఈ థైరాయిడ్‌లో హైపర్ థైరాయిడిజం, హైపో థైరాయిడిజం అని రెండు రకాలు ఉంటాయి. థైరాయిడ్ కారణంగా అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అందుకే 40 ఏండ్లు దాటగానే థైరాయిడ్ పరీక్షలు చేయించుకోవడం అవసరం.

## విటమిన్ లెవెల్స్ టెస్ట్

మనం ఆరోగ్యంగా జీవించాలంటే శరీరానికి విటమిన్‌లు, ఖనిజాలు చాలా అవసరం. అయితే ఈ విటమిన్‌లు, ఖనిజాలు ఏదీ ఎంత మోతాదులో ఉండాలో అంతే ఉంటేనే ఆరోగ్యంగా ఉంటాం. లేదంటే అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. అందుకే విటమిన్‌లు, మినరల్స్ సమపాళ్లలో అందేలా మన ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి. అందుకోసం 40 ఏండ్ల పైబడిన వాళ్లు తరచూ విటమిన్ మోతాదులకు సంబంధించిన పరీక్షలు చేయించుకోవాలి.

## గుండె పరీక్షలు

షుగర్, బీపీ, హైకొలెస్ట్రాల్ లాంటి జీవనశైలి వ్యాధులు క్రమంగా గుండె జబ్బులకు దారితీస్తాయి. కొవ్వు కారణంగా గుండెకు రక్తాన్ని సరఫరా చేసే నరాల్లో బ్లాక్స్ రావడం, అదేవిధంగా గుండె కండరాలు బలహీనపడం లాంటి సమస్యలు గుండెపోటు, కార్డియాక్ అరెస్ట్ వచ్చే ప్రమాదాన్ని పెంచుతాయి. అందుకే 40 ఏండ్లు దాటిన వాళ్లు గుండె పరీక్షలు చేయించుకోవడం కూడా చాలా ముఖ్యం.

## జాగ్రత్తలు

పరీక్షలు చేయించుకోవడంతో ఏవైనా వ్యాధులు బయటపడితే చికిత్స తీసుకోవాలి. లేదంటే ఆ వ్యాధి మరింత ముదిరిపోయే ప్రమాదం ఉంది. అదేవిధంగా జబ్బులేమీ బయటపడలేవు కదా అని నిర్లక్ష్యంగా ఉంటే భవిష్యత్తులో జబ్బులబారిన పడే ప్రమాదం ఉంది. కాబట్టి అలాంటి ప్రమాదం రావద్దంటే జీవనశైలిలో తగిన మార్పులు చేసుకోవాలి. పండ్లు, కూరగాయలు ఎక్కువగా తినాలి. రోజూ వాకింగ్ లేదా తేలికపాటి వ్యాయామం చేయాలి. యోగా చేస్తే ఇంకా మంచిది. తగినంత నిద్ర పోవాలి. ఒత్తిడిని తగ్గించుకోవాలి.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**



# మీ గెలుపు దేశానికే గర్వకారణం

- మన కీర్తిపతాకను రెపరెపలాడించారు
- కామన్వెల్త్ పతకవీరులకు ప్రధాని మోదీ అభినందనలు
- భారత్ మ్యాప్‌పై స్పందించిన లవ్లీనాకు ప్రత్యేక ప్రశంస
- క్రీడాకారులతో ముచ్చటించిన ప్రధాని



**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** అంతర్జాతీయ క్రీడా వేదికపై అద్భుత ప్రతిభ కనబరిచి దేశ కీర్తిపతాకను రెపరెపలాడించిన భారత క్రీడాకారులను ప్రధాని నరేంద్ర మోదీ అభినందించారు. "మీ గెలుపు మీ ఒక్కరిదే కాదు.. యావత్ దేశానికీ గర్వకారణం" అంటూ ప్రశంసించారు. కామన్వెల్త్ క్రీడల్లో పతకాలు సాధించిన భారత అథ్లెట్లు ఆదివారం ప్రధానిని కలిశారు. వారితో మోదీ సరదాగా ముచ్చటిస్తూ లడ్డూలు తినిపించారు. ఈ సందర్భంగా భారత బాక్సర్ లవ్లీనా బోర్గోహైన్‌ను ప్రధాని ప్రత్యేకంగా అభినందించారు. గ్లాస్గోలోని ఓ రెస్టారెంట్‌లో భారత్ చిత్రపటం అసంపూర్తిగా ఉండటాన్ని గుర్తించి ఆమె అభ్యంతరం వ్యక్తం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. "అక్కడ ఏం జరిగింది?" అంటూ మోదీ అడగగా లవ్లీనా వివరించారు. కామన్వెల్త్ క్రీడల్లో మంచి ప్రదర్శన చేసిన ఆనందంలో చివరి రోజు కొందరు భారత అథ్లెట్లు రెస్టారెంట్‌కు వెళ్లారని, అక్కడ హ్యాండ్ టవల్స్‌పై ముద్రించిన భారత్ చిత్రపటం సరిగా లేదని గుర్తించినట్లు చెప్పారు. ఈశాన్య రాష్ట్రాలతోపాటు కశ్మీర్‌కు సంబంధించిన భూభాగాలను సరిగా చూపించకపోవడంతో రెస్టారెంట్ నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అనంతరం వారు తప్పును సరిచేస్తామని చెప్పడంతోపాటు క్షమాపణలు తెలిపారని వివరించారు. విజయోత్సాహంలో ఉన్న సమయంలోనూ దేశ చిత్రపటానికి సంబంధించిన అంశాన్ని గుర్తించి స్పందించడం అభినందనీయమని మోదీ కొనియాడారు. "ఆ వీడియో సాధారణమైనది కాదు. దేశ ప్రజలు దీన్ని చాలా కాలం గుర్తుంచుకుంటారు" అని ప్రశంసించారు. మరో బాక్సర్ నరేంద్ర బేర్వాల్ తనకు గతంలో పాకిస్థాన్ బాక్సర్‌తో ఎదురైన ఆసక్తికర అనుభవాన్ని ప్రధానితో పంచుకున్నారు. 2015 మిలిటరీ క్రీడల్లో తన తొలి పోరు పాకిస్థాన్ బాక్సర్‌తో జరిగిందని చెప్పారు. ఆ పోరులో తాను విజయం సాధించిన అనంతరం పాక్ బాక్సర్ తనతో సరదాగా మాట్లాడిన విషయాన్ని గుర్తుచేశారు. తన పేరు నరేందర్ కావడం, తన కోచ్ పేరు నరేందర్ రాణా కావడం, అప్పటికే భారత ప్రధానిగా నరేంద్ర మోదీ ఉండటాన్ని ప్రస్తావిస్తూ.. "ఇకపై నరేందర్ అనే పేరు అంటేనే నాకు ఇష్టం ఉండదు" అని పాక్ బాక్సర్ అన్నట్లు బేర్వాల్ వివరించారు. ఈ ఆసక్తికర సంఘటన విని ప్రధాని మోదీ నవ్వేశారు.

# రాహుల్ కెప్టెన్ కాకపోవడమే మంచిది!



- సారథ్య భారం లేకుంటే అసలు ఆట బయటకొస్తుంది
- ఏటా 500-600 పరుగులు చేసే సత్తా ఉంది
- ఒంటిచేత్తో రెండు, మూడు మ్యాచ్‌లు గెలిపించగలడు
- మాజీ క్రికెటర్ వసీం జాఫర్ కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 10:** భారత స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్‌కు కెప్టెన్సీ బాధ్యతలు లేకపోవడమే మంచిదని మాజీ క్రికెటర్, పంజాబ్ కింగ్స్ బ్యాటింగ్ కోచ్ వసీం జాఫర్ అభిప్రాయపడ్డారు. సారథ్య భారం లేకుండా ఆడితే రాహుల్‌లోని అసలైన బ్యాటర్ బయటకు వస్తాడని పేర్కొన్నారు. స్వేచ్ఛగా ఆడే అవకాశం కల్పిస్తే ఐపీఎల్‌లో ప్రతి సీజన్‌లో 500 నుంచి 600 పరుగులు చేసే సామర్థ్యం అతడికి ఉందని ప్రశంసించారు. ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్‌కు రాహుల్ కెప్టెన్‌గా వ్యవహరించిన సమయంలో జాఫర్ ఆ జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా పనిచేశారు. ఆ సమయంలో ఇద్దరి మధ్య మంచి అనుబంధం ఏర్పడింది. తాజాగా ఓ క్రికెట్ చర్చా కార్యక్రమంలో రాహుల్ ఆటతీరు, నాయకత్వంపై జాఫర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.

## సారథ్యంతో అదనపు ఒత్తిడి


రాహుల్ అత్యంత నమ్మకమైన బ్యాటర్ అని జాఫర్ కొనియాడారు. తనదైన రోజున ఒంటిచేత్తో మ్యాచ్‌ను మలుపుతిప్పగల సత్తా అతడి సొంతమన్నారు. ఒక ఐపీఎల్ సీజన్‌లో రెండు, మూడు మ్యాచ్‌లను తన బ్యాటింగ్‌తోనే గెలిపించగలడని చెప్పారు. అయితే కెప్టెన్సీ బాధ్యతలు అతడి సహజమైన ఆటతీరుపై అదనపు ఒత్తిడిని పెంచుతాయని అభిప్రాయపడ్డారు. "రాహుల్‌కు కెప్టెన్సీ లేకపోవడమే మంచిది. ఎలాంటి అదనపు భారం లేకుండా స్వేచ్ఛగా బ్యాటింగ్ చేస్తే అతడు మరింత ప్రమాదకరమైన ఆటగాడిగా మారతాడు. అతడి నుంచి ప్రతి సీజన్‌లో భారీగా పరుగులు ఆశించవచ్చు" అని జాఫర్ పేర్కొన్నారు. పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్‌జెయింట్స్ జట్లకు గతంలో రాహుల్ నాయకత్వం వహించారు. అనంతరం ఢిల్లీ క్యాపిటల్స్‌కు మారిన తర్వాత కెప్టెన్సీకి దూరంగా ఉండటం అతడి బ్యాటింగ్‌కు మేలు చేస్తుందని జాఫర్ అభిప్రాయపడ్డారు.

## లంక సిరీస్‌లో రాహుల్ కీలకం

భారత్-శ్రీలంక మధ్య గాల్, కొలంబో వేదికలుగా జరగనున్న రెండు టెస్టుల సిరీస్‌లో కేఎల్ రాహుల్ పాత్ర కీలకంగా మారనుంది. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్‌లో భాగమైన ఈ సిరీస్‌లో అనుభవజ్ఞుడైన బ్యాటర్‌గా జట్టు బ్యాటింగ్ విభాగానికి బలాన్నివ్వాల్సిన బాధ్యత అతడిపై ఉంది. ప్రాక్టీస్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో ఓపెనర్‌గా బరిలోకి దిగిన రాహుల్ 40 పరుగులతో మంచి లయలో కనిపించాడు. కెప్టెన్సీ ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఆడుతూ శ్రీలంకతో టెస్టు సిరీస్‌లో భారీ పరుగులు సాధించాలని అభిమానులు

# టీమిండియా 'రహస్యాలు' ఐపీఎల్‌లోనే తెలిసిపోయాయి!

- భారత ఆటగాళ్ల వ్యూహాలను దగ్గరుండి గమనించా: హెన్రిక్స్
- సచిన్ నుంచి కోహ్లీ వరకు దిగ్గజాలతో మెలిగే అవకాశం
- అంతర్జాతీయ క్రికెట్‌లో ఆ అనుభవం ఎంతో ఉపయోగపడింది
- కష్టకాలంలో కావ్య మారన్ అండగా నిలిచారన్న ఆసీస్ ఆల్‌రౌండర్







**సిడ్నీ, ఆగస్టు 10:** ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఆడటం తన క్రికెట్ కెరీర్‌కు కొత్త దిశ చూపిందని ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ మోయిసెస్ హెన్రిక్స్ పేర్కొన్నారు. భారత క్రికెటర్లతో కలిసి ఆడటం ద్వారా వారి మానసిక దృక్పథం, ఆటతీరు, మ్యాచ్ వ్యూహాలను దగ్గరుండి తెలుసుకునే అవకాశం లభించిందన్నారు. ఆ అనుభవం అంతర్జాతీయ క్రికెట్‌లో తనకు ఎంతగానో ఉపయోగపడిందని వెల్లడించారు. ఐపీఎల్‌లో వివిధ ఫ్రాంచైజీలకు ప్రాతినిధ్యం వహించిన సమయంలో సచిన్ టెండూల్కర్, మహేంద్రసింగ్ ధోనీ, విరాట్ కోహ్లీ, వీరేంద్ర సెహ్వాగ్, రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా వంటి భారత దిగ్గజాలతో మైదానంలోనూ, వెలుపలా మెలిగే అవకాశం లభించిందని హెన్రిక్స్ తెలిపారు. భారత ఆటగాళ్లు మ్యాచ్‌కు ఎలా సిద్ధమవుతారు? ఒత్తిడిని ఎలా ఎదుర్కొంటారు? ప్రత్యర్థులపై ఎలాంటి వ్యూహాలు అమలు చేస్తారు? వంటి అనేక అంశాలను దగ్గరుండి పరిశీలించగలిగానన్నారు. వారి ఆటలోని సూక్ష్మ అంశాలు, వ్యూహాలను తెలుసుకోవడం తనకు ఎంతో విలువైన అనుభవమని పేర్కొన్నారు.

## కష్టకాలంలో కావ్య అండ

ఆస్ట్రేలియా జట్టులో స్థానం కోసం పోరాడుతున్న సమయంలో తాను తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొన్నట్లు హెన్రిక్స్ వెల్లడించారు. ఆ సమయంలో తనకు అవసరమైన మద్దతు లభించక ఇబ్బంది పడ్డానని పేర్కొన్నారు. అలాంటి క్లిష్ట సమయంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు చెందిన కావ్య మారన్ తనకు అండగా నిలిచి ప్రోత్సహించారని చెప్పారు. ఆమె ఇచ్చిన భరోసాను జీవితాంతం మరచిపోలేనని కృతజ్ఞతలు తెలిపారు. 2014 నుంచి 2017 మధ్య సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహించిన హెన్రిక్స్.. 2016లో జట్టు ఐపీఎల్ చాంపియన్‌గా నిలవడంలో తనవంతు పాత్ర పోషించారు. బ్యాటింగ్, బౌలింగ్‌లో కీలక ప్రదర్శనలు చేసి జట్టు విజయాల్లో భాగస్వామిగా నిలిచారు. ఆస్ట్రేలియా దేశవాళీ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన హెన్రిక్స్ ప్రస్తుతం పోర్చుగల్ జాతీయ క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.





# గోల్ కొట్టిన ఆనందంలో జంప్ టన్నెల్‌లో పడ్డ ప్లేయర్

## గాయంతో మ్యాచ్‌కు దూరం.. చివరకు గోల్ కూడా రద్దు

## సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారిన వీడియో

**రియో, ఆగస్టు 10:** గోల్ కొట్టిన ఆనందం ఎక్కువసేపు నిలవలేదు. సంబరాల్లో గంతేసిన ఆటగాడు ఏకంగా స్టేడియం టన్నెల్‌లో పడిపోయాడు. గాయపడి మ్యాచ్ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. చివరకు తాను కొట్టిన గోల్ కూడా రద్దయింది. బ్రెజిల్‌లో జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్‌లో చోటుచేసుకున్న ఈ గమ్మత్తైన ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కొరిటిబా క్లబ్ డిఫెండర్ జేసీ మరన్హో.. చాపెకోయెన్సె జట్టుతో జరిగిన మ్యాచ్‌లో ప్రత్యర్థి గోల్‌పోస్టులోకి బంతిని పంపించాడు. గోల్ సాధించానన్న ఆనందంతో ప్రేక్షకుల వైపు పరుగులు తీశాడు. అక్కడ ఉన్న ప్రకటన బోర్డును ఉత్సాహంగా దూకాడు. అయితే బోర్డు వెనుక స్టేడియం టన్నెల్ ఉందన్న విషయాన్ని గమనించకపోవడంతో నేరుగా అందులో పడిపోయాడు. టన్నెల్‌లో పడిన మరన్హో కొద్దిసేపటి తర్వాత తిరిగి బయటకు వచ్చాడు. మడమకు గాయమైనప్పటికీ గోల్ సాధించానన్న ఆనందంతో సంబరాలు కొనసాగించాడు. అయితే గాయం తీవ్రత కారణంగా కొద్దిసేపటికే మ్యాచ్ నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.

## చివరకు గోల్ కూడా లేదు!

ఇంత జరిగిన తర్వాత మరన్హోకు మరో షాక్ తగిలింది. వీడియో సహాయ సమీక్షలో అతడు గోల్ చేసే సమయంలో ఆఫ్‌సైడ్‌లో ఉన్నట్లు తేలడంతో గోల్‌ను రద్దు చేశారు. దీంతో గోల్ దక్కలేదు.. సంబరాల్లో గాయమై మ్యాచ్‌నూ వీడాల్సి వచ్చింది. అయితే మరన్హో ప్రాతినిధ్యం వహించిన కొరిటిబా జట్టు చివరకు మ్యాచ్‌లో విజయం సాధించడం అతడికి ఊరటనిచ్చింది. ఇదే స్టేడియంలో గతంలోనూ ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. 2014లో కామెరూన్ ఆటగాడు జోయెల్ కూడా గోల్ సంబరాల్లో ప్రకటన బోర్డు వద్ద గంతేసి టన్నెల్‌లో పడిపోయాడు.






# అష్మిత అద్భుతం

## కొరియా మాస్టర్స్ టైటిల్ కైవసం

## ఈ ఘనత సాధించిన తొలి భారత షట్లర్‌గా రికార్డు

**ఆసన్ (దక్షిణ కొరియా), ఆగస్టు 10:** కొరియా గడ్డపై భారత యువ షట్లర్ అష్మిత చాలిహా చరిత్ర సృష్టించింది. బీడబ్ల్యూఎఫ్ కొరియా మాస్టర్స్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీలో అద్భుత ప్రదర్శనతో మహిళల సింగిల్స్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. తద్వారా కొరియా మాస్టర్స్ టైటిల్ గెలిచిన తొలి భారత షట్లర్‌గా రికార్డు నెలకొల్పింది. అంతేకాదు.. తన కెరీర్‌లో తొలి బీడబ్ల్యూఎఫ్ టూర్ టైటిల్‌ను ముద్దాడింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్‌లో అష్మిత 14-21, 21-14, 21-14తో నాలుగో సీడ్ హాన్ జియాన్ జి (చైనా)పై సంచలన విజయం సాధించింది. 53 నిమిషాలపాటు హోరాహోరీగా సాగిన పోరులో తొలి గేమ్‌ను కోల్పోయిన అష్మిత.. ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. ఆ తర్వాత వరుసగా రెండు గేమ్‌లను సొంతం చేసుకుని ప్రత్యర్థిని మట్టికరిపించింది. తొలి గేమ్‌ను 14-21తో కోల్పోయిన అష్మిత రెండో గేమ్‌లో ఆటతీరును పూర్తిగా మార్చేసింది. ప్రత్యర్థిపై ఎదురుదాడికి దిగుతూ 21-14తో గేమ్‌ను సొంతం చేసుకుంది. నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ అదే జోరు కొనసాగించి 21-14తో విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ టోర్నీలో అష్మిత ప్రయాణం ఆద్యంతం ఆకట్టుకుంది. క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్ హినా అకెచి (జపాన్)కి షాకిచ్చిన ఆమె.. సెమీఫైనల్లో భారత్‌కే చెందిన రక్షితను ఓడించి తొలిసారి బీడబ్ల్యూఎఫ్ ఫైనల్‌కు చేరింది. తుదిపోరులోనూ ఒత్తిడిని అధిగమించి చాంపియన్‌గా నిలిచింది. అష్మిత విజయానికి మరో ప్రత్యేకత ఉంది. 2024లో కొరియా ఓపెన్ సందర్భంగా ఆమె కుడి మోకాలికి గాయమైంది. అనంతరం శస్త్రచికిత్స చేయించుకుని కొంతకాలం ఆటకు దూరమైంది. రెండేళ్ల తర్వాత అదే కొరియా గడ్డపై తిరిగి టైటిల్ సాధించడం విశేషం. ఇక ఈ నెల 1న ముగిసిన తైపీ ఓపెన్‌లో భారత షట్లర్ తన్వి శర్మ విజేతగా నిలవగా.. వారం రోజుల వ్యవధిలోనే అష్మిత మరో టైటిల్‌ను అందించింది. దీంతో భారత్ ఖాతాలో వరుసగా రెండు బీడబ్ల్యూఎఫ్ టూర్ టైటిళ్లు చేరాయి. ఈ ఏడాది దేవికా సిహాగ్, పీవీ సింధు, తన్వి శర్మ, అష్మిత చాలిహా బీడబ్ల్యూఎఫ్ టైటిళ్లు సాధించడం విశేషం. భారత్ తరఫున బీడబ్ల్యూఎఫ్ టూర్ మహిళల సింగిల్స్ టైటిల్ గెలిచిన షట్లర్ల జాబితాలో పీవీ సింధు, సైనా నెహ్వాల్, తన్వి శర్మ, దేవికా సిహాగ్ సరసన అష్మిత చేరింది.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
మంగళవారం
11 ఆగస్టు 2026




# కపాలిలో హన్సిక ఫస్ట్ లుక్ విడుదల

నారా రోహిత్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'కపాలి'. పోలీస్ బ్యాక్‌డ్రాప్‌తో సాగే డిఫరెంట్ సైకలాజికల్ హారర్ థ్రిల్లర్‌గా ఈ సినిమాను దర్శకుడు రామ్ గన్ని రూపొందిస్తున్నారు. ఇందులో హన్సిక మోత్వాని కథానాయికగా నటిస్తోంది. విభిన్నమైన కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ఇప్పటికే ఆసక్తి నెలకొనగా.. తాజాగా హన్సిక పుట్టినరోజు సందర్భంగా విడుదల చేసిన ఆమె ఫస్ట్ లుక్ మరింత క్యూరియాసిటీని పెంచింది. మేకర్స్ విడుదల చేసిన ఫస్ట్ లుక్‌ను ఎంతో క్రియేటివ్‌గా డిజైన్ చేశారు. హన్సిక ముఖాన్ని బ్లాక్ అండ్ వైట్ హ్యాండ్ స్కెచ్ తరహాలో చూపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్, సీరియస్ లుక్ చూస్తుంటే సినిమాలో ఆమె పాత్రకు చాలా ప్రాధాన్యత ఉన్నట్లు అనిపిస్తోంది. సాధారణమైన దుస్తులతో, మెడలో చిన్న చైన్‌తో కనిపిస్తున్న హన్సిక చూపుల్లో ఏదో తెలియని రహస్యం దాగి ఉన్నట్లుగా పోస్టర్‌ను రూపొందించారు. హన్సిక ముఖంతో పాటు పోస్టర్ బ్యాక్‌గ్రౌండ్‌లో కనిపించే అంశాలు కూడా సినిమా కథపై ఆసక్తిని పెంచుతున్నాయి. ప్రాచీన కాలానికి చెందినట్లుగా కనిపించే కొన్ని గుర్తులు, వింతైన సింబల్స్ పోస్టర్ చుట్టూ కనిపిస్తున్నాయి. మరోవైపు చీకటి అడవిలో భారీ చెట్ల మధ్య నుంచి సూర్యకాంతి ప్రసరించేలా రూపొందించిన విజువల్ కూడా ఆకట్టుకుంటోంది. ముఖ్యంగా అడవిలో ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి నీడ పోస్టర్‌లో మరింత సస్పెన్స్‌ను క్రియేట్ చేస్తోంది. దీంతో 'కపాలి' కేవలం సాధారణ హారర్ కథ కాకుండా.. మిస్టరీ, సైకాలజీ, సస్పెన్స్ అంశాలతో కూడిన డార్క్ థ్రిల్లర్‌గా ఉండబోతుందా అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. సాధారణంగా కనిపించే దెయ్యాలు, భయపెట్టే సన్నివేశాలకే పరిమితం కాకుండా.. అంతుచిక్కని చీకటి ప్రపంచంలోకి ప్రేక్షకులను తీసుకెళ్లేలా 'కపాలి' కథ ఉండబోతున్నట్లు ఫస్ట్ లుక్ చూస్తే అర్థమవుతోంది. కనిపించని శక్తులు, పురాతన గుర్తులు, మిస్టరీ అంశాల చుట్టూ కథ నడుస్తుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కళ్యాణ చక్రవర్తి మంథినా, భాను కిరణ్ ప్రతాప నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా.. విజయ్ కృష్ణ లింగమనేని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. విజువల్‌గా కూడా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేలా సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది.

# వారణాసి హన్మంతుడిగా రామ్‌చరణ్?

దర్శకధీరుడు రాజమౌళి, సూపర్‌స్టార్ మహేశ్‌బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి'. 'ఆర్‌ఆర్‌ఆర్'తో అంతర్జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించిన తర్వాత రాజమౌళి రూపొందిస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అందుకు తగ్గట్టుగానే సినిమా నుంచి వస్తున్న ప్రతి అప్డేట్ అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ఇప్పుడు ఈ చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన మల్టీస్టారర్ వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. మహేశ్‌బాబు కెరీర్‌లో 29వ చిత్రంగా రూపొందుతున్న 'వారణాసి'లో గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. భారీ స్థాయిలో అడ్వెంచర్, యాక్షన్ అంశాలతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో పలు కాలాలను, విభిన్న ప్రపంచాలను కలిపి రాజమౌళి సరికొత్త అనుభూతిని అందించబోతున్నట్లు ఇప్పటికే ప్రచారం జరుగుతోంది. 'వారణాసి' కథలో త్రేతాయుగానికి సంబంధించిన కీలకమైన ఎపిసోడ్ ఉంటుందని, ఆ భాగంలో మహేశ్‌బాబు శ్రీరాముడి పాత్రలో కనిపించనున్నారని ఇప్పటికే వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడు మరో ఆసక్తికరమైన అంశం తెరపైకి వచ్చింది. శ్రీరాముడి పాత్రలో మహేశ్‌బాబు కనిపించే ఎపిసోడ్‌లో హనుమంతుడిగా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించనున్నారనే ప్రచారం సినీ వర్గాల్లో జోరుగా సాగుతోంది.అయితే ఈ విషయంపై ఇప్పటివరకు చిత్ర బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. మొదట హనుమంతుడి పాత్ర కోసం మరో నటుడి పేరు వినిపించినప్పటికీ, ఈ పాత్రకు కావాల్సిన పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్, బాడీ లాంగ్వేజ్ దృష్ట్యా రామ్ చరణ్ అయితే మరింత ప్రభావవంతంగా ఉంటుందని రాజమౌళి భావిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. 'ఆర్‌ఆర్‌ఆర్'లో అల్లూరి సీతారామరాజుగా చరణ్‌ను అద్భుతంగా ఆవిష్కరించిన రాజమౌళి.. క్లైమాక్స్‌లో ఆయనను రాముడి రూపంలో చూపించిన విధానం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఇప్పుడు అదే దర్శకుడు 'వారణాసి'లో చరణ్‌ను హనుమంతుడి పాత్రలో చూపిస్తే అది సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా మారుతుందని అభిమానులు భావిస్తున్నారు.



# ఇంద్రపుత్రగా కిరణ్ అబ్బవరం



యంగ్ హీరో కిరణ్ అబ్బవరం ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకెళుతున్నారు. ఇటీవల ఆయన నటించిన 'చెన్నై లవ్ స్టోరీ' ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి రెస్పాన్స్ అందుకోవడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా సత్తా చాటుతోంది. ఈ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న కిరణ్.. మరోవైపు భారీ స్థాయిలో తెరకెక్కనున్న పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కిరణ్ అబ్బవరం ప్రముఖ నిర్మాత ప్రేరణ అరోరా, జీ స్టూడియోస్ భాగస్వామ్యంతో ఓ భారీ బ్జడెట్ మైథలాజికల్ సినిమాలో నటించబోతున్నట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కీలక వివరాలను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రానికి 'ఇంద్రపుత్ర' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. టైటిల్‌ను అధికారికంగా ప్రకటిస్తూ చిత్ర బృందం ఆసక్తిని పెంచింది. పేరు చూస్తేనే ఇది పురాణ, ఇతిహాస నేపథ్యంతో రూపొందనున్న భారీ చిత్రమనే విషయం స్పష్టమవుతోంది. ఈ సినిమాతో శ్రీకాంత్ పుప్పాల దర్శకుడిగా పరిచయం కానున్నారు. ఆయన గతంలో 'కాంతార చాప్టర్ 1' చిత్రానికి ఫస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశారు. ఆ అనుభవాన్ని ఇప్పుడు తన తొలి దర్శకత్వ చిత్రానికి ఉపయోగించుకోనున్నారు. భారీ విజువల్స్, పురాణ నేపథ్యం, విభిన్నమైన కథాంశంతో ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో రూపొందించేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. 'ఇంద్రపుత్ర' రెగ్యులర్ షూటింగ్‌ను అక్టోబర్‌లో ప్రారంభించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్ట్‌ను పలు భాషల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ఎ÷-లాన్ చేస్తున్నారు.ఈ సినిమా కేవలం ఒక కథతో ముగిసిపోయే ప్రాజెక్ట్ కాదని తెలుస్తోంది. మేకర్స్ రూపొందించనున్న మైథలాజికల్ యూనివర్స్‌లో 'ఇంద్రపుత్ర' మొదటి అధ్యాయంగా ఉండబోతున్నట్లు సమాచారం. దీంతో ఈ సినిమా తర్వాత ఇదే ప్రపంచంలో మరిన్ని కథలు, పాత్రలతో సినిమాలు తెరకెక్కించే అవకాశం ఉంది. ఈ చిత్రాన్ని ప్రేరణ అరోరా, జీ స్టూడియోస్‌తో కలిసి నిర్మాణ బృందం భారీ స్థాయిలో రూపొందిస్తోంది. కీర్తన్ సహ నిర్మాతగా వ్యవహరించనున్నారు. ప్రస్తుతం కథ, ప్రీ-ప్రొడక్షన్ పనులను పూర్తి చేసే దిశగా చిత్ర బృందం ముందుకు సాగుతోంది.

# మహేశ్ ఏఐ వీడియో షేర్ చేసి వంగా

## కృష్ణ డైలాగ్ మహేశ్ పలికినట్లుగా క్రియేషన్

ప్రముఖ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా షేర్ చేసిన మహేశ్ బాబు ఏఐ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. సూపర్ స్టార్ పుట్టినరోజు సందర్భంగా అందరూ విషెస్ చెప్పగా.. సందీప్ ఓ ఏఐ వీడియోతో శుభాకాంక్షలు తెలిపారు. దీనికి మహేశ్ కూడా ఫిదా అయ్యారు. దివంగత లెజండరీ నటుడు కృష్ణ 'కిరాయి కోటిగాడు' సినిమాలో చెప్పిన ఐకానిక్ డైలాగ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో సందీప్ రీక్రియేట్ చేశారు. ఈ వీడియోతో వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమాపై గతంలో జరిగిన చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. గతంలో ప్రచారం పొందిన 'డెవిల్' ప్రాజెక్ట్‌పై సందీప్ హింట్ ఇచ్చారా అని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. ఇక తనకు బర్త్‌డే విషెస్ చెప్పిన అందరికీ ధన్యవాదాలు తెలుపుతూ మహేశ్ పోస్ట్ పెట్టారు. 'వారణాసి' తనకెంతో ప్రత్యేకమైన చిత్రమని పేర్కొన్నారు. ఆ సినిమా విడుదల కోసం తానెంతో ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. అభిమానులంతా గర్వపడేలా 'వారణాసి' ఉంటుందన్నారు.





# 'టాక్సిక్'తో నా సత్తా చూపించా

## 'నీ వల్ల కాదు' అన్నవారికి సినిమా పూర్తిచేసి సమాధానం చెప్పా: గీతూ



'టాక్సిక్' సినిమా ప్రారంభించినప్పుడు "నీ వల్ల కాదు" అంటూ చాలామంది తనను నిరుత్సాహపరిచారని, ఇప్పుడు చిత్రాన్ని విజయవంతంగా పూర్తి చేసి తన సత్తా ఏమిటో చూపించానని దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ భావోద్వేగానికి గురయ్యారు. తనపై నమ్మకం ఉంచి ఇంత భారీ చిత్రానికి అవకాశం ఇచ్చిన హీరో యశ్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటానని చెప్పారు. యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన 'టాక్సిక్' ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా విడుదల సమీపిస్తున్న నేపథ్యంలో తాజాగా చిత్ర ప్రచార వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గీతూ తన సినీ ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. 'టాక్సిక్' ప్రారంభించిన సమయంలో తన సామర్థ్యంపై పలువురు సందేహాలు వ్యక్తం చేశారని తెలిపారు. భారీ స్థాయిలో రూపొందుతున్న ఇలాంటి చిత్రాన్ని తాను పూర్తి చేయలేనని వ్యాఖ్యానించినవారూ ఉన్నారని గుర్తుచేసుకున్నారు. అయితే ఆ విమర్శలను పట్టించుకోకుండా ముందుకు సాగానని, చివరకు అనుకున్న విధంగా సినిమాను పూర్తి చేయగలిగానని చెప్పారు. తనపై పూర్తి నమ్మకం ఉంచి 'టాక్సిక్'కు అంగీకరించిన యశ్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. తన సామర్థ్యాన్ని నమ్మి వెన్నుదన్నుగా నిలిచినందుకు ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటానని గీతూ పేర్కొన్నారు. భారీ అంచనాల మధ్య రూపొందిన 'టాక్సిక్'తో యశ్ మరోసారి ప్రేక్షకుల ముందుకు వస్తుండటంతో సినిమాపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. తాజాగా విడుదలైన ప్రచార చిత్రంతో ఆ అంచనాలు మరింత పెరిగాయి.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN**, and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: 9030717172, 9391127717